
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5

గుంటూరు జిల్లా వార్తలు

మంగళవారం 7 జనవరి 2025



మాచర్ల కోర్టు వద్ద తురకా కిశోర్, అతని సోదరుడు శ్రీకాంత్

నాడు దర్పం..
నేడు దుర్భరం

- పిన్నెల్లి ఇలాకాలో అరాచకాలతో వెలిగిన కిశోర్
- ఖద్దరు చొక్కాతో ఆనాటి ఖాకీల అండతో అకృత్యాల పరంపర
- నేడు చెప్పులు కూడా లేని దుస్థితిలో జైలులోకి

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ హయాంలో ఆనాటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల అండదండలతో మాచర్లలో ప్రజాస్వామ్యానికి పాతరవేయటంలో ప్రధాన పాత్ర పోషించిన మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్ ఎట్టకేలకు కటకటాలపాలయ్యాడు. టీడీపీ నేతలపై దాడులు చేయటం, ఎన్నికల సమయంలో విధ్వంసకర చర్యలకు పాల్పడటం ద్వారా అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లికి వీరవిధేయుడుగా మారిన అరాచక వ్యక్తికి మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టి ఖద్దరు చొక్కా వేసుకొని తిరిగే అవకాశం కల్పించారు. దీంతో కిశోర్ ఆగడాలకు గత ప్రభుత్వంలో అడ్డే లేకుండా పోయింది. మాచర్ల నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టేందుకు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న వంటి వారు ఆ నియోజకవర్గంలో ధైర్యంగా అడుగుపెడితే అడ్డుకొని వారి వాహనాలపై కర్రలతో దాడులు చేసి హత్యాయత్నం చేసేందుకు కిశోర్ నాయకత్వంలో వైసీపీ మూక ప్రయత్నించింది. టీడీపీ నేతలు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కిశోర్ 'ఘనత' ను తెలుసుకొని ఆ నాటి ముఖ్యమంత్రి జగన్ కూడా పిన్నెల్లితో పాటు అతన్ని పిలిపించుకొని శభాష్ అని మెచ్చుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇక దాంతో కిశోర్ ఆగడాలకు అంతే లేకుండా పోయింది. ఏకంగా అనేక కేసులు తూతూ మంత్రంగా పెట్టిన ఆ నాటి పోలీసులు అతని దరిదాపులకు వెళ్ళే సాహసం కూడా జగన్ ప్రభుత్వంలో చేయలేకపోయారు. ముఖ్యం గా అప్పట్లో మాచర్ల టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జూలకంటి బ్రహ్మారెడ్డి నియోజకవర్గంలో 2022 డిసెంబరు 16న టీడీపీ చేపట్టిన ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించే ప్రయత్నం చేయగా కిశోర్ నాయకత్వంలో దాడులు చేసి అడ్డుకోవటమే కాకుండా పార్టీ కార్యాలయాన్ని, బ్రహ్మారెడ్డి ఇంటిని ధ్వంసం చేశారు. అంతటి నేరానికి పాల్పడిన కిశోర్‌పై అప్పటి పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేసి ఎటువంటి చర్యలు తీసుకోకుండా చేతులు దులుపేసుకున్నారు. ఇక తెలుగుదేశం అధికారంలోకి రావటంతో చంద్రబాబునాయుడు సీఎంగా పగ్గాలు చేపట్టిన వెంటనే అప్పటి నుంచి ఇప్పటి వరకు కిశోర్ పరారై అజ్ఞాతంలోకి వెళ్ళి అత్యంత దీనస్థితిలో గడిపాడు. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు గుండు కొట్టించుకొని తళతళా మెరిసే ఖద్దరు చొక్కాలు స్థానే అతి సాదా సీదా గళ్ళ చొక్కాలు వేసుకొని హైదరాబాద్‌లో గడుపుతూ ఆఖరికి కాళ్ళకు చెప్పుల్లేని స్థితిలో పోలీసుల కళ్ళలో పడి చిక్కాడు. ఆ నాడు పిన్నెల్లి అండతో యథేచ్ఛగా చెలరేగి వైసీపీకి అధికారం శాశ్వత మనే భావనతో కన్నుమిన్నూ తెలియకుండా వ్యవహరించి సీన్ మారటంతో కుటుంబాన్ని సైతం వదిలేసి ఎక్కడో అనామకుడిగా ఆరు నెలలకు పైగా దుర్భరమైన జీవితం గడపాల్సి వచ్చింది.

పందెం కోళ్లు కత్తి కట్టి కాలు దువ్వడానికి సిద్ధం అవుతుంటే, రూ.కోట్లలో పందాలు వేసేందుకు వీలుగా బరులను సిద్ధం చేస్తున్నారు. మరో వారంలో పండుగ సందడి మొదలవుతున్న తరుణంలో కృష్ణానది తీర ప్రాంతాలు, సముద్ర తీర మండలాల్లో కొన్ని చోట్ల ఇప్పటికే కోడి పందాల కోసం బరులు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న బరుల కోసం ఇప్పటికే రబీ పంట వేసిన చేలను తీసుకుని పది నుంచి 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అన్ని ఏర్పాట్లతో బరికి సిద్ధమవుతున్నారు. మరోపక్క కేవలం పందెం కోసమే పెంచుతూ వస్తున్న కోడి పుంజులు రూ.లక్షలు పలుకుతున్నాయి. వీటి ధరే ఇంత ఉంటే వాటితో వేసే పందాలు ఎంతటి స్థాయిలో ఉంటాయనేది ఊహకందని విషయమే. కేవలం కోడిపందాలే కాకుండా కోతముక్క, గుండాట వంటి మిగిలిన జూద క్రీడలకు ఈ బరులు ఏర్పాటు చేస్తున్న ఆవరణలోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు మద్యం, బిర్యానీ కేంద్రాలకు కొదవే లేకుండా చూసేందుకు కూడా వెనుకాడటం లేదు.



చెరుకుపల్లి మండలం పుషాడపువారిపాలెం దగ్గర ఎక్సకవేటర్‌లు, ఇతరయంత్రాలతో కోడి పందాల కోసం బరి సిద్ధం చేస్తున్న చిత్రం



బరి తెగింపునకు సిద్ధం

- సంక్రాంతి వేళ కోడి పందాలకు సిద్ధమవుతున్న తీరం
- జూదం, మద్యం దుకాణాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- చివరిలో మ్యూజికల్ నైట్స్‌కూ సన్నాహాలు
- ఇప్పటి నుంచే లాడ్జీలూ బుకింగ్

తెనాలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన గుంటూరు జిల్లా నుంచి సముద్ర తీరంలోని బాపట్ల జిల్లా వరకు కోడి పందాలకు కొదవ లేకుండా బరులు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రెండు నుంచి ఐదు కి.మీ దూరంలో ఒక బరి ఉండేలా ఏర్పాట్లు చేస్తే, ఇప్పుడు మాత్రం వాటిని తగ్గించి కేవలం జూదం కోసమే కాదన్నట్లు పరిమితంగానే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కృష్ణా తీరంలో ప్రస్తుతానికి 8 చోట్ల పెద్ద స్థాయి బరులు ఏర్పాటు చేసేందుకు నేతల నుండి అనుమతి దక్కినట్లు సమాచారం. అటు సముద్ర తీర మండలాల్లోని నిజాంపట్నం, నగరం, పీవీ పాలెం, కర్లపాలెం, బాపట్ల మరికొన్ని చోట్ల కోడి పందాలకు చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు బరులు ఏర్పాటు అవుతున్నాయి. దుగ్గిరాల మండలంలో ఒక చోట, కొల్లిపర మండలంలో రెండు చోట్ల, కొల్లూరు మండలంలో రెండు చోట్ల, భట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, నగరం మండలాల్లో ఒక్కొక్క చోట బరులు ఏర్పాటు చేసేందుకు నేతలు ఒకే అన్నారంటూ వాటిని స్థానిక నాయకులు యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసేందుకు పెద్ద పెద్ద ఎక్సకవేటర్‌లను దించేశారు. బరులు వేసే ప్రాంగణం చుట్టూ సిమెంట్ దిమ్మెలు, ముళ్ల కంచె సాయంతో ఫెనిసింగ్ వేస్తూ లోపల మాత్రం ఐదు నుంచి 10 వరకు బరులు ఉండేలా ఒక్కో చోట సిద్ధం చేస్తున్నారు.

మద్యం, జూదానికి ఫుల్ డిమాండ్

కోడి పందాల కోసం ఏర్పాటు చేసే బరులను ఆయా ప్రాంతాల నేతల అనుచరులు, కింది స్థాయి నేతలు తమ ఆధీనంలో సిద్ధం చేస్తుంటే దానిలో కేవలం కోడి పందాలకే కాకుండా జూదం, మద్యం శిబిరాలకు మంచి డిమాండ్ పలుకుతోంది. సాధారణంగా ఒక బరిని ఏర్పాటు చేయాలంటే దానికి అంగీకారం తెలిపే నేతలకు, పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ వంటి సంబంధిత శాఖల అధికారులకు పందాలు నిర్వహించే వారం నుంచి పది రోజుల గడువునకు బరి స్థాయిని బట్టి రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు మమూళ్లు ఇవ్వడం పరిపాటి. అంత మొత్తంలో రాబట్టుకునేందుకు నిర్వాహకులు కూడా రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పందాలు వేసుకునేందుకు వీలుగా ప్రత్యేక బరులను సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటే మద్యం దుకాణాలు, బిర్యానీ సెంటర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఒక్కోదానిని రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వేలంలో వారికి అప్పగించేందుకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. కోడి పందాలు చూడాలన్నా, కోడిని బరిలో దింపాలన్నా ఫీజు చెల్లించాల్సిందే. పందెం కాసిన మొత్తంలోనూ పది శాతం నిర్వాహకులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఇవి కాక పార్కింగ్, కోతముక్క, గుండాట వంటి శిబిరాలకు లక్షల్లోనే డిమాండ్ ఉంటోంది. గతంలో బరులు ఎక్కువగా ఉండటంతో పందెం వేసే వారిని ఆకట్టుకునేందుకు బుల్లెట్ నుంచి కారు వరకు బహుమతులు అందించిన వారు ఉన్నారు. అయితే ఈ సారి బరులు పరిమితంగానే ఉండటంతో ఇటువంటి ఆకర్షణీయ బహుమతులు ఏ స్థాయిలో ఉంటాయో చూడాల్సిందే.



పందాల కోసం సిద్ధంగా ఉన్న కోళ్లు



చిన్న బరుల కోసం సిమెంట్ దిమ్మెలతో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్న చిత్రం

కోడి పందాలకు స్థానికంగా ఉండే వారే కాకుండా తెలంగాణా నుంచి కూడా భారీ సంఖ్యలో ఏటా వస్తుండటంతో పట్టణాల్లో లాడ్జీలు కూడా ఇప్పటి నుంచే నిండిపోతున్నాయి. కొన్ని చోట్ల నిర్వాహకులే కొన్ని లాడ్జిలను రిజర్వ్ చేసుకుని పెట్టుకుంటుంటే పట్టణాలకు దూరంగా బరులు ఉన్నచోట మాత్రం ఖాళీగా ఉన్న ఇళ్లను అద్దెకు తీసుకుని తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు.సంక్రాంతి పండుగ చివరి రెండు రోజులు కోడి పందాలతో పాటు ముగింపు వేడుకల కిం ద మ్యూజికల్ నైట్స్ కూడా ఏర్పాటు చేసేందుకు శిబిరాలను ఇప్పటి నుంచే కేటాయిస్తున్నారు. వీటిలో సరదాగా జనానికి ఒక చోట అయితే వీఐపీలకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వారికి అన్ని వసతులు కల్పించేందుకు కూడా హైటెక్ సొగసులతో తీర్చిదిద్దేందుకు గృ హోపకరణ సామాగ్రిని దింపేస్తున్నారు. పండు గ దగ్గర పడుతుండటంతో పందెం కోళ్ల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఒక్కో కోడి పుంజు రూ.20 వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతోందని పెంపకందారులు చెబుతున్నారు. మొత్తం మీద సంక్రాంతి వేళ కోడి పందాల వేడుకలు మాత్రం జూద క్రీడలకు సిద్ధమవుతోంది.



గ్రీన్ గ్రేస్‌కు అనుమతులు లేవని ఆధారాలు చూపుతున్న ధూళిపాళ్ల నరేంద్ర

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌లో ఫ్లాట్లను కొనొద్దు

- వాటికి ఎటువంటి అనుమతుల్లేవు
- రైల్వే కూడా ఎన్‌వోసీ రద్దు చేసింది
- వాటిని దాచిపెట్టి విక్రయించాలని అంబటి మురళి చూస్తున్నాడు
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

6

ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకొని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మా ణాలపై గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, సీపవో శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, భూగర్భ జలనవరుల శాఖ డీడీ వందనం, డీపీవో సాయికుమార్, జీఎస్ డబ్ల్యూ ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, ఏపీ ఎంఐపీ పీడీ వజ్రశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లా ఓటర్లు 17,96,356



కలెక్టరేట్‌లో తుది ఓటర్ల జాబితాలను విడుదల చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో డీఆర్‌వో ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

- నియోజకవర్గాల వారీగా జాబితాల విడుదల
- మహిళా ఓటర్లే అధికం
- ప్రతీ 1000 మందిలో 729 మందికి ఓటుహక్కు

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
తాడికొండ(ఎస్సీ)	100485	107741	2	208228
మంగళగిరి	141231	152227	12	293470
పొన్నూరు	109665	118312	11	227988
తెనాలి	129423	138576	37	268036
ప్రత్తిపాడు(ఎస్సీ)	129785	138849	22	268656
గుంటూరు పశ్చిమ	135737	142857	42	278636
గుంటూరు తూర్పు	122196	129111	35	251342
మొత్తం	868522	927673	161	1796356

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్)-2025లో భాగంగా చివరిదైన తుది ఓటర్ల జాబితాలు విడుదలయ్యాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఎస్ నాగలక్ష్మి సోమవారం సాయంత్రం జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ జాబితాలను విడుదల చేసి వాటి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 17 లక్షల 96 వేల 356కి పెరిగింది. ఓటర్లలో మహిళలదే పైచేయిగా ఉన్నది. పురుషులు 8 లక్షల 66 వేల 871 మంది ఉంటే మహిళలు 9 లక్షల 27 వేల 601 మంది నమోదయ్యారు. ట్రాన్స్‌జెండర్లు 161, సర్వీసు ఓటర్లు 1723 మంది ఉన్నారు. లింగ నిష్పత్తి ప్రకారం ప్రతీ వెయ్యి మంది పురుషులకు 1070 మంది మహిళలకు ఓటు హక్కు ఉన్నది. అలానే జనాభాలో వెయ్యి మందిలో 729 మందికి ఓటుహక్కు ఉన్నట్లు తేలింది. ఓటర్లతో పాటు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌ని కూడా జిల్లా యంత్రాంగం చేసింది. తాడికొండలో గతంలో 244 ఉంటే ఒకటి అదనంగా పెరిగి 245 అయ్యాయి. మంగళగిరిలో 286 ఉండగా ఇప్పుడు అదనంగా 17 పెరిగి 303. పొన్నూరులో 264, తెనాలిలో 273 యథాతథంగా ఉన్నాయి. ప్రత్తిపాడులో 282 ఉండగా ఆరు పోలింగ్ కేంద్రాలు పెరిగి 288, గుంటూరు పశ్చిమలో 282 ఉంటే 9 పెరిగి 291, తూర్పులో 250 ఉంటే ఆరు పెరిగి 256 అయ్యాయి. ఈ విధంగా పోలింగ్ కేంద్రాల సంఖ్య 1884 నుంచి 1920కి చేరాయి. ఎప్పటిలానే జిల్లాలో మహిళ ఓటర్లు పైచేయి సాధించారు. అలానే 2,93,470 మంది ఓటర్లతో మంగళగిరి ప్రథమస్థానంలో, 2,78,636 మందితో గుంటూరు పశ్చిమ ద్వితీయ, 2,68,656 ఓటర్లతో ప్రత్తిపాడు తృతీయ స్థానంలో నిలిచాయి. అన్ని నియోజకవర్గాల కంటే తక్కువగా తాడికొండలో 2,08,228 మంది ఓటర్లు నమోదయ్యారు.

రాజధాని భూసమీకరణలో భూములిచ్చిన అసైన్డ్ రైతుల కౌలు చెల్లింపులు ఇప్పటికీ కలగానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో తమ కష్టాలు తీరుతాయని మూడేళ్లుగా ఎదురు చూస్తున్న వారి ఆశలు ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా నెరవేరకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసైన్డ్ రైతులపై గత ప్రభుత్వం మోపిన సీఐడీ కేసుల అంశం ఎట్టకేలకూ కూటమి సర్కారు కొలిక్కి తెచ్చినా వారికి ఇంకా కౌలు అందకపోవడం విషాదం. మరో వారం రోజుల్లో సంక్రాంతి పండుగ రానున్న నేపథ్యంలో వారి ఆశలు మరింత పెరిగాయి. పండుగకైనా తమకు రావాల్సిన కౌలు బకాయిలు అందుతాయన్న ఆశతో వారంతా ఎదురు చూస్తున్నారు.

కలగానే.. అసైన్డ్ కౌలు

- కిందటి నెలలోనే కొలిక్కి వచ్చిన అమరావతి 'అసైన్డ్' వ్యవహారం
- రైతుల భూములకు ఎన్ఓసీలు ఇచ్చిన కలెక్టర్
- ఇప్పటికీ 1600 మంది రైతులకు అందని మూడేళ్ల కౌలు
- పండుగకైనా ఇవ్వాలని రైతుల వేడుకోళ్లు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689. 14 ఎకరాల భూములు ఇచ్చారు. అసైన్డ్ రైతులు ఇచ్చిన భూములపై గత వైసీపీ సీఐడీ విచారణ తంతు నడిపించి, ఆ భూములను 'నాట్ ట్యాలీడ్' జాబితాలో పెట్టింది. మూడేళ్లుగా వారికి కౌలు అందకుండా చేసింది. దీంతో రాజధాని పరిధిలోని అసైన్డ్ రైతులు మూడేళ్లుగా నరకం అనుభవించారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దశలవారీగా రైతుల సమస్యలు పరిష్కరించింది. కిందటేడాది డిసెంబరు నాటికి అసైన్డ్ రైతుల భూములకు సంబంధించిన కేసుల్లో ఏపీ సీఐడీ, జిల్లా కలెక్టర్ నో అబ్జక్షన్ లెటర్లు కూడా ఇచ్చారు. దీంతో అసైన్డ్ రైతులంతా తమ కౌలు కష్టాలు తీరిపోయాయని సంతోషించారు. కానీ ఇప్పటికీ వారికి కౌలు దక్కలేదు.

1600 మందికి కౌలు పెండింగ్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అసైన్డ్ రైతుల కౌలు బకాయిలు చెల్లించ డంపై దృష్టిపెట్టింది. ఏ సమస్య లేని రైతులకు వెంటనే కౌలు చెల్లించింది. తొలి విడతగా ఈ ఏడాది ఆగస్టులో 1,234 మంది అసైన్డ్ రైతులను నాట్ ట్యాలీడ్ జాబితా నుంచి విముక్తి కల్పించి వారికి రూ. 22 కోట్లు కౌలు బకాయిలు చె ల్లించింది. ఆ తరువాత రెండో విడతగా మరో 609 మందికి సీఐడీ కేసుల నుంచి విముక్తి కలిగించి కౌలు చెల్లింపుల కోసం రూ. 2.35 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఆమోదించి ఆర్థిక శాఖకు పంపించారు. మళ్లీ నవంబరులో మరో 1,093 మంది రైతులకు విముక్తి కల్పించారు. కాగా డిసెంబరు 20న మిగిలిన రైతులపై కేసులు కూడా తొలగించి కౌలు చెల్లింపులు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఇప్పటికీ 1300 ఎకరాలకు చెందిన 1,600 మంది రైతులకు మూడేళ్ల కౌలు బకాయిలు పెండింగులోనే ఉన్నాయి.

ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరగడం లేదని ఆవేదన

రాజధాని కోసం భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం రాకతో వాటి రిజిస్ట్రేషన్ ఐదేళ్లుగా ఆగిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ రైతుల రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభ మయింది. వీటిపై సీఆర్డీఏ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు పలురకాల అభ్యంతరాలు పెడుతూ రిజిస్ట్రేషన్ చేయడం లేదని అసైన్డ్ రైతులు వాపోతున్నారు. అసైన్డ్ రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఆటంకమూ ఉండబోదని చెప్పిన తరువాత కూడా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు కాకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ఉన్నతస్థాయి అధికారులు దీనిపై దృష్టి సారించి రైతులకు కౌలు, ప్లాట్ల రిజిస్ట్రేష న్లు చేయించాలని వేడుకుంటున్నారు.



కౌలు కళ్లజూసి మూడేళ్లయింది
ఎం. విజయభాస్కర్

రాజధాని కోసం భూములు సంతోషంగా ఇచ్చాం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఏటా కౌలు సక్రమంగా అందేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక సీఐడీ కేసులు పెట్టి విచారణ పేరుతో కౌలు ఆపేసింది. కౌలు కళ్ల జూసి ఇప్పటికి మూడేళ్లు అవుతోంది.

నిత్యం నరకం అనుభవిస్తున్నాం
జే విష్ణువర్ధనరావు

మూడేళ్లుగా కౌలు రాకపోవడంతో నరకం చూస్తున్నాం. రాజధాని కోసం భూములు త్యాగం చేసినందుకు మాకు ఇంత పెద్ద శిక్షా? అప్పులపాలైపోయాం. రూపాయి కోసం చేయి చాచాల్సి వస్తోంది. పిల్లల్ని చదువులు మాన్పించే పరిస్థితి వచ్చింది. తట్టుకుని ఓపిక పట్టాం. ఇప్పుడు కూడా ఇలా అయితే ఎలా? పండగకల్లా కౌలు చెల్లించాలి.

సంక్రాంతికి ఆర్టీసీ సమాయత్తం

- జిల్లా వ్యాప్తంగా 143 సర్వీసులు సిద్ధం
- ఈనెల 9 నుంచి 19 వరకు స్పెషల్ సర్వీసులు

6

పంతుళ్ళ పాలెం

- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉపాధ్యాయులున్న గ్రామంగా ఏనుగుపాలెం గుర్తింపు

8

శృంగారపురం బెల్లంతో అరిసెలు అదుర్స్..!

సచివాలయాలకు ఫైబర్ నెట్ సేవలు అందించాలి

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు, పక్కన బీఎస్ఎన్ఎల్ జీఎమ్ శ్రీధర్

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలకు, ఆయా పాఠశాలలకు బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ సేవలు అందేలా ప్రణాళిక రూపొందించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గుంటూరు, స్థానిక చంద్రమౌళి నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సోమవారం టెలికం అడ్వైజరి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రైవేటు ఆపరేటర్ల కంటే మెరుగైన సేవలు అందించాలని సూచించారు. భారత్ నెట్ వినియోగదారులను పెంపొందించుకోవాలని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని 4జీ టవర్లను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో కూడా సేవల్లో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలోని 40శాతం టవర్లను 4జీగా మార్చామని, మిగిలిన టవర్లను ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా ఎంపీ అయోధ్య రామిరెడ్డి పాల్గొనగా, నేరుగా ఆ సంస్థ డీజీఎమ్ శ్యామ్‌ప్రసాదు, ఐఎఫ్ఏ బాజీ, ఏజీఎమ్ గిరిబాబు, డీఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను భవిత కేంద్రాలకు పంపండి


మాట్లాడుతున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్యకుమారి

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లోపాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ ఎ.సూర్యకుమారి అన్నారు. సోమవారం గుంటూరు మహిళా ప్రాంగణంలో పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల విషయంలో తల్లిదండ్రులకు తగిన కౌన్సెలింగ్ నిర్వహించి వారిని భవిత కేంద్రాలకు తరలించాలని అన్నారు. పిల్లలకు పోషకాహార సేవలను అందించడానికి, వారి సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, అంగన్‌వాడీ కార్యకర్తలందరి నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేయడం కోసం భారత ప్రభుత్వం పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి విజయలక్ష్మి, ఈడీ పద్మజ, కోర్సు డైరెక్టర్ పుష్పలత, డాక్టర్ ప్రియాంక, ఉదయలక్ష్మి, నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.

రేపు డైట్‌లో రంగోత్సవ్ పోటీలు

గుంటూరు(విద్య), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్) బోయపాలెంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 8న రంగోత్సవ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతులు చదువుతున్న బాల బాలికలు అర్హులని తెలిపారు. మొత్తం 8 విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. క్విజ్, స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాల డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ (తెలుగు, ఆంగ్లం) రంగోలి (5 గురు సభ్యులు) జానపద నృత్యం, డిజిటల్ కొలేజి (యూనిటీ, సమైక్యత పోస్టర్) స్లోగన్ రైటింగ్ (ఏక్ భారత్ శ్రేష్ఠ భారత) రోల్ ప్లే (భారత సంస్కృతి, చరిత్రకు సంబంధించినవి) ఉంటాయి. గతేడాది పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన వారు పాల్గొనుటకు అనర్హులని తెలిపారు. ప్రతి కళా రూపానికి 5 నిముషాల సమయం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో అధ్యాపకులు సి.పోలేరు, డాక్టర్ కె.ప్రసాద్ (9704790917, 8019207528)ను సంప్రదించాలని సూచించారు.

చినవడ్లపూడిలో యువకుడి బలవన్మరణం

మంగళగిరి సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినవడ్లపూడి గ్రామంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన పప్పు బాల జగదీశ్ (28) చినవడ్లపూడి గ్రామానికి చెందిన వలివేటి బాలకృష్ణ వద్ద గేదెల ఫారంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన జగదీశ్ తరచూ ఇంటికి ఫోను చేసి తనకు చదువు అబ్బకపోవడంతో జీవితం నాశనమైందనీ, తనకు బతకాలని లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 29న గేదెల షెడ్డు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు ఎయిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ జగదీశ్ ఆదివారం రాత్రి మృతి చెందినట్టు తెలిపారు. మృతుని సోదరుడు పూర్ణలీలా సాయికృష్ణ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌లో ఫ్లాట్లను కొనొద్దు

● వాటికి ఎటువంటి అనుమతుల్లేవు
● రైల్వే కూడా ఎన్‌వోసీ రద్దు చేసింది
● వాటిని దాచిపెట్టి విక్రయించాలని అంబటి మురళి చూస్తున్నాడు
● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర, పక్కన పిల్లి బాబురావు

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అంబటి మురళి గుంటూరు నగరంలోని స్వామి థియేటర్ సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్లను కొనవద్దని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు విద్యానగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ గ్రేస్ హైరైజ్ అపార్టుమెంట్స్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినా వాటిని విక్రయించాలని అంబటి మురళి చూస్తున్నాడని, ఆయన ఉచ్చులో పడొద్దని సూచించారు. రైల్వే అనుమతి లేకపోయినా రాజకీయ పలుకుబడితో నగరపాలక సంస్థ అధికారులను ప్రలోభాలకు గురిచేసి ఈ నిర్మాణం చేపట్టాడని అన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తే రాజకీయ వేధింపులంటూ అంబటి మురళి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మిస్తున్న ఆదిత్య ఇన్‌ఫ్రాకు రైల్వే ఎన్‌వోసీ రద్దు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రద్దు చేసిన లేఖను అప్పటి మంత్రి, మురళీ సోదరుడు అంబటి రాంబాబు అండతో నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాయం చేసిన విషయం నిజమా, కాదా అని ప్రశ్నించారు. ఆ తరువాత అనుమతి కోసం ఏలూరు జూట్‌మిల్ ప్రైవేట్ లిమిటడ్ (భజరంగ్ జూట్‌మిల్లు పూర్వ పేరు) దరఖాస్తు చేసుకున్నా రైల్వే అధికారులు తిరస్కరించారని అన్నారు. అనుమతి రద్దు, తిరస్కరణలు వైసీపీ అధికారంలోనే జరిగాయని, టీడీపీ హయాంలో కాదని గుర్తుచేశారు. దీంతో రాజకీయ కక్ష ఎక్కడ ఉందని ప్రశ్నించారు.

మోసానికి ప్రతి రూపం...

రైల్వే ట్రాక్ నుంచి 60 అడుగుల రోడ్డును వదిలివేసి నిర్మాణం చేస్తానని మాస్టర్ ప్లాన్‌లో చూపించి, ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఆ రోడ్డులో కూడా నిర్మాణం చేపట్టడం వాస్తవం కాదా అని నిలదీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా మరోసారి అనుమతి కోసం కార్పొరేషన్‌కు లేఖ పంపడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకపక్క వందల సంఖ్యలో ఫ్లాట్లను నిర్మిస్తూ డెవలప్‌మెంట్ పేరుతో ఏలూరు జూట్‌మిల్‌కు 87 ఫ్లాట్లను ఇచ్చే విధంగా జీపీఏ చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మరోవైపు అపార్ట్‌మెంట్లు కొన్నవారితో హైకోర్టులో కేసు వేయడం ఏ విధంగా చూడాలన్నారు. మోసానికి అంబటి మురళి ప్రతి రూపమని మండిపడ్డారు. అసలు జూట్‌మిల్ స్థలం మదర్ డాక్యుమెంట్లు మురళీ వద్ద లేవనీ, వాటిని దాచి పెట్టి వినియోగదారులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాడని ఆరోపించారు. గత టీడీపీ హయాంలోనే రిజిస్ట్రేషన్లు చేయవద్దని అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. మదర్ డాక్యుమెంట్లు, సేల్ డీడ్‌లను బయట పెట్టాలని అడిగిన జూట్‌మిల్ కార్మిక సంఘ నాయకుడు పిల్లి బాబురావుపై అంబటి మురళి దాడి చేయించాడని ఆరోపించారు. గ్రీన్ గ్రేస్ భవనాలకు అడ్డగోలు అనుమతులకు సహకరించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని గుంటూరు ఎమ్మెల్యేలతో కలసి త్వరలోనే ప్రభుత్వాన్ని కోరనున్నట్లు చెప్పారు. సమావేశంలో జూట్‌మిల్లు కార్మిక సంఘం నేత పిల్లి బాబురావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా మార్చడమే లక్ష్యం

● ప్రతి పాఠశాలకు క్రీడా మైదానం
● శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు


క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న శాప్ చైర్మన్ రవి, ఎంపీ, విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు (విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందనీ, ఇందులో భాగంగా ప్రతి పాఠశాలకు క్రీడా మైదానం ఉండాలని జీవో జారీ చేసిందని క్రీడాప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే 'విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు 2025' ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు సోమవారం కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడాంశాలతో పాటు నృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్లు నగదు ప్రోత్సాహకంతో పాటు గ్రూప్-1 ఉద్యోగాన్ని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆసియా క్రీడలు, ఖేలో ఇండియా తదితర క్రీడల్లో సత్తాచాటిన వారికి అందుకు అనుగుణంగా పారితోషికాలు అందిస్తుందని వెల్లడించారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ శాతాన్ని ప్రభుత్వం పెంచిందని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనూరాధ, నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అందరికీ సమాన విద్యావకాశాలు


హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, మైనార్టీ సలహాదారు ఎండీ షరీఫ్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విద్యాపరంగా ఎదగాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అన్నివర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని మైనారిటీ బాలికల హాస్టల్‌ను సోమవారం ఆయన ఏపీ మైనారిటీ సలహాదారుడు, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్‌తో కలిసి పరిశీలించారు. మైనారిటీ హాస్టల్‌లో సౌకర్యాలు, స్టడీ తరగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో వసతులు బాగున్నాయా?, బోధన విధానం ఎలా ఉంది? అంటూ ఆరా తీశారు. హాస్టల్లో ఎలాంటి చిన్న సమస్య వచ్చినా వెంటనే తమను సంప్రదించాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. హాస్టళ్లలో కేవలం విద్యా బోధన, స్టడీ తరగతులకే పరిమితం కాకుండా నేటి తరానికి అనుగుణంగా ఎనిమిదో తరగతి నుంచే టెక్నాలజీలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న మైనారిటీ హాస్టళ్లను సువిశాలమైన సొంత భవనాల్లోకి మారుస్తామని తెలిపారు. షరీఫ్ మాట్లాడుతూ మైనారిటీల విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. అన్ని పాఠశాలలో సమగ్ర విద్యా విధానాలు అవలంబించేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సూర్రై శ్రీనివాస్, జగన్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, జమీర్, రఫీ, పుట్టగుంటి వెంకటేశ్వరరావు, కలాం, ఈర్ల లక్ష్మి, మస్తాన్, అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం

● జిల్లా వ్యాప్తంగా 143 సర్వీసులు సిద్ధం
● 9 నుంచి 19 వరకు స్పెషల్ సర్వీసులు

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పర్వదినాలైన సంక్రాంతికి అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విభజిత గుంటూరు జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతోపాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి 143 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచే సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇందుకోసం టిక్కెట్ రిజర్వేషన్ చేసుకొనే సౌకర్యం కల్పించారు. సంక్రాంతి పండగకు విద్యా, ఉద్యోగం, ఇతర పనులపై హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో ఉన్న వారు తిరిగి గుంటూరు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ వరకు హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లాకు చేరుకునేలా సర్వీసులు సిద్ధం చేశారు. 9వ తేదీన హైదరాబాద్ నుంచి గుంటూరుకు 15 బస్సులు, తెనాలి 1, పొన్నూరుకి 2 సర్వీసులు అందుబాటులో ఉంచారు. అలానే 10న గుంటూరుకు 28, తెనాలికి 3, మంగళగిరికి 4, పొన్నూరుకు 5 బస్సులు ఉంచారు. రద్దీకి అనుగుణంగా 13 వరకు 143 సర్వీసులు ఏర్పాటు చేశారు. పండగ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణికుల కోసం 15వ తేదీ రాత్రి నుంచే స్పెషల్ బస్సులను సిద్ధం చేస్తున్నారు. 19వ తేదీ వరకు పండగ రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు ఉంచుతామన్నారు.

స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే..



సంక్రాంతి పర్వదినానికి సంబంధించి జిల్లాలో ఎక్కడా ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రద్దీ ఉన్న డిపోల్లో అదనపు సర్వీసులు ఉంచుతున్నాం. అంతేగాక గతంలో మాదిరి స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలతోనే ప్రయాణించేలా ఆర్టీసీ సంస్థ నిర్ణయం తీసుకుంది. భద్రతతో కూడిన ఆర్టీసీ బస్సులను ప్రజలు ఆదరించాలి. ముందుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించాం.

– డీపీటీవో రవికాంత్

ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యే నరేంద్ర సీరియస్


జేసీతో సమావేశమైన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో పండిన ధాన్యం అంతా రైతుల వద్దే ఉంది. అక్కడి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం నిల్వలతో నిండిపోయాయి. అధికారులు అత్యుత్సాహంతో పక్క నియోజకవర్గాల పంటను కొనుగోలు చేయటంతో స్థానిక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పొన్నూరులో సమావేశం నిర్వహించి అధికారుల తలంటినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో ఆయన మరింత సీరియస్ అయ్యారు. సోమవారం ఈ విషయంపై మాట్లాడేందుకు గుంటూరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. జాయింట్ కలెక్టర్‌తో భేటీ అయ్యారు. విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అధికారులు ఈ విషయంలో సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం...


న్యాయమూర్తుల శిక్షణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం ఆశించిన స్థాయిలో జరగడం లేదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారధి అన్నారు. న్యూఢిల్లీకి చెందిన సుప్రీమ్ కోర్ట్ మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఏపీ హైకోర్ట్ ఎంపిక చేసిన న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వం మీద నలభై గంటల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి శిక్షకులుగా సుప్రీంకోర్ట్ మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ, రాజస్థాన్ నుంచి అడ్వకేట్ ప్రమీల, కేరళ నుంచి అడ్వకేట్ వి.పి.తంకచన్‌లను నియమించారు. ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు కార్యక్రమ ప్రారంభోత్సవంలో శిక్షకులు, ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, పీడీజే వైవీఎస్‌బీజీ పార్థసారధి, జిల్లా న్యాయ సేవాధికార సంస కార్యదర్శి టి.లీలావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీజే పార్థసారధి మాట్లాడుతూ మన రాష్ట్రంలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం అనుకున్న స్థాయిలో జరగడం లేదన్నారు. శిక్షణ కి వచ్చిన న్యాయమూర్తులందరూ మధ్యవర్తిత్వంలో నైపుణ్యాన్ని పెంచుకొని సుప్రీంకోర్టు వారి అంచనాలకు తగినట్టు మధ్యవర్తిత్వంలో భాగస్వాములు కావాలని సూచించారు. మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సివిల్ జడ్జిలు (జూనియర్, సీనియర్ డివిజన్), జిల్లా జడ్జిలు ఇరవైఐదు మంది పాల్గొన్నారు.

గుంటూరు మీదుగా మరో నాలుగు సంక్రాంతి స్పెషల్స్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా మరో నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ .శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07615 కాచీగూడ - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 11, 15 తేదీల్లో సాయంత్రం 5.45కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07616 శ్రీకాకుళం రోడ్డు - కాచీగూడ రైలు ఈ నెల 12, 16 తేదీల్లో మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదుగా మరుసటి రోజు ఉదయం 7.35కి కాచీగూడ చేరుకొంటుంది. నంబరు. 07617 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 8న రాత్రి 7.20కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07618 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 9న మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 6.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

10 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంటూరు(లీగల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాదిని పోలీసులు చిత్రహింసలకు గురిచేయటాన్ని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టుల్లో తమ విధులను బహిష్కరించి నిరసన తెలపాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షతన గుంటూరులో సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. క్రిస్మస్ సందర్భంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు పొన్నూరుకు చెందిన దళిత న్యాయవాది బేతాళ ప్రకాశరావు ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ ఫిరోజ్ఖాన్ ప్రోద్బలంతో అతన్ని ఆస్పత్రి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి సీఐ రవికిరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్ కుమార్, కానిస్టేబుళ్లు గోపి, మాధవ గోపి, స్టేషన్ కంప్యూటర్ ఆపరేటర్ మల్లికార్జునరావులు చిత్రహింసలు పెట్టారని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. సంబంధిత డాక్టర్, పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గత వారం ఆందోళన ఫలితం గా ఎస్ఐపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. సీఐ రవి కిరణ్ , డాక్టర్ ఫిరోజ్ ఖాన్‌లపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఎస్ఐ మీద నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు మార్చాలని బార్ అసోసియేషన్‌ల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ సంఘటనపై ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు, మానవ హక్కుల సంఘానికి, డాక్టర్‌పై చర్యలకు మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టు విధులకు గైరా జరు కావాలని తీర్మానించారు.

పది నెలలైనా రికవరీ లేదు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుల్లడిగుంట, కొర్నెపాడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అక్షయ కోల్డ్ స్టోరేజ్‌లో చోరీ జరిగి 10 నెలల గడుస్తున్నా ఇంతవరకు రికవరీ చేయలేదని కృష్ణనగర్‌కు చెందిన కోల్డ్ స్టోరేజ్ యజమాని కొండపల్లి స్రవంతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

ఎరువులకు కొరత లేదు

● జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని.. రైతుల అవసరాలు తగ్గట్టుగా అన్ని రకాల ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబా టులో ఉంచామని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గుంటూరు జిల్లా రబీ సీజన్‌లో పంటల సాగు ముమ్మరంగా సాగుచేశారని.. ప్రకృతి విపత్తుల విషయంలో భయాందోళన వీడిన రైతులు వ్యవసాయశాఖ ప్రణాళికకు తగ్గట్టుగానే పంటలు సాగు చేశారని చెప్పారు. ఇప్పుడు కొన్ని పంటలకు ఎరువులు చాలా అవసరం కావడంతో రైతులు ఆ దిశగా అడుగులు వేస్తున్నా మన్నారు. రబీ సీజన్‌లో అవసరమయ్యే ఎరువులను నెల వారీగా లెక్కించి అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. రబీ సీజన్‌లో యూరియా 70,826 మెట్రిక్ టన్నులు, డీఏపీ 19,225 మెట్రిక్ టన్నులు, పొటాష్ 3322 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకేఎస్ 34,914 మెట్రిక్ టన్నులు అవసరం ఉందన్నారు. జిల్లాకు ఎంత మేరకు ఎరువులు రావాలో అంత మేరకు వచ్చాయని మండల కేంద్రాలు, గ్రామ స్థాయిలోని స్టాక్ పాయింట్లలో వాటిని అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రస్తుతం అన్ని రకాల ఎరువులకు జిల్లాలో కొరత లేదన్నారు. ఎరువులు ఎక్కువ రేటుకు అమ్ముతున్న వారి సమాచారం మండల కేంద్రాల్లోని వ్యవసాయ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగానికి తెలియజేయాలన్నారు. విచారణ చేపట్టి డీలర్లపై కఠినమైన చర్యలు తీసుకుం టామని లైసెన్స్ కూడా రద్దు చేస్తామని స్పష్టంచేశారు.

టీఎన్‌యూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలో సోమవా రం టీఎన్‌యూఎస్ డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ ప్రచార కార్యదర్శి జంపని ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ జగదీష్‌కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు పాలేటి శ్రీనివాసరావు, అధ్యక్షుడు బాలస్వామి, సెక్రటరీ పాలేటి జగదీష్ బాబు, సహాధ్యక్షులు వీరయ్య, శ్రీధర్, గౌరవ సలహాదారులు, పణిదత్తు అధ్యక్షులు షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ క్యాలెండర్...

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ముద్రించిన క్యాలెండర్‌ను కళాశాల ఆర్జేడీ కళావతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్, నగర అధ్యక్షుడు యశ్వంత్, సభ్యులు సౌమ్య సుభాని సుధీర్ కార్తీక్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

గుంటూరు (విద్య) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో సీవీ రేణుక సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎల్‌బీనగర్‌లో మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డీ తిరుపతిరెడ్డి కొన్ని సంవత్సరాలుగా పాఠాలు సక్రమంగా బోధించడం లేదు. ఈ విషయమై ఫిర్యాదులు రావడంతో ఎంఈవోతో డీఈవో సీవీ రేణుక విచారణ నిర్వహించారు. విచారణలో ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి పాఠశాలలో సాంఘికశాస్త్రం బోధన సక్రమంగా చేయడం లేదని తేలడంతో సస్పెండ్ చేస్తూ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన ఓపీలను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు ఓపీ కౌంటర్లను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆదివారం ప్రారంభించారు. సాహో జీజీహెచ్ అనే నినాదంతో సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఆసుపత్రిలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారన్నారు. ఆస్పత్రికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై సూపరింటెండెంట్, ఇతర అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, ఆస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యులు డాక్టర్ సయ్యద్ రసూల్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ హరిత, ఏపీ ఎం ఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విష్ణుభట్లకి సత్కారం

గుంటూరు(విద్య), జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వేద పండితులు విష్ణుభట్ల నాగ శంకర వేంకట లక్ష్మీనారాయణకి చెరువు సూర్యనారాయణ మూర్తి సీతారామమ్మ పురస్కారాన్ని సోమవారం అందజేశారు. హిందూ కళాశాల ఏడీ హాల్లో జరిగిన కార్యక్రమంలో హైస్కూల్స్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివ రామకృష్ణ ప్రసాద్, ముళ్ళపూడి సత్యనారాయణశాస్త్రి, హైస్కూల్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శతక పద్య పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హిందూ కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు తీసుకొని మోసం

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని తన నుంచి రెండు లక్షలు తీసుకొని మోసం చేశారం టూ చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామానికి చెందిన ఎం శ్రీనివాసరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన బావమరిది వెంకటప్పయ్య ద్వారా వ్యవసా యశాఖలో అటెండర్‌గా పనిచేసే ఎన్.సునీల్ పరిచయం అయ్యాడన్నారు. పీఆర్‌డీలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద రెండు రూ.లక్షలు తీసుకున్నాడన్నారు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులివ్వాలని అడుగుతుంటే బెదిరిస్తున్నాడని బాధితుడు శ్రీనివాసరావు తెలిపారు.

రెవెన్యూ సదస్సులో అందిన అర్జీలను పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 183 అర్జీలు
● పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలతో పాటు రెవెన్యూ, రీ సర్వే సదస్సులలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిం చారు. కార్యక్రమానికి 183 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీకుమారి కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను గుణాత్మకంగా పరిశీలించి వారి సంతృప్తి స్థాయిని పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ భార్గవతేజ్ మాట్లాడుతూ కోర్టు కేసులను సమీక్షిస్తూ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ. పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఎస్‌వో కోమలి పద్మ, డీపీవో నాగసాయికుమార్, డీసీవో వీరాచారి. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలి

50 ఏళ్ల నిండిన వ్యవసాయ కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. అనంతరం సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు అమలు చేసి వ్యవసాయ కార్మికుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తన్నీరు ప్రభుదాసు, గుర్రంకొండ సత్యానందం ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. అనంతరం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీమ్ మాట్లాడుతూ ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉండటంతో ఉన్నత విద్య చదవలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ సభ్యులు షేక్ మీరావలీ, తిరుమలరావు తదితరులు ఉన్నారు.

పిల్లలు పట్టించుకోవడం లేదు

ఆస్తిని రాయించుకుని భోజనం కూడా పెట్టకుండా వేధిస్తున్నారని స్థానిక నల్ల చెరువు జీరో లైనుకు చెందిన వృద్ధురాలు జే రాఘవమ్మ అర్జీ అందజేశారు. భర్త 30 ఏళ్ల క్రితమే చనిపోయారని, ఆస్తిని కొడుకు, ఇద్దరూ కుమార్తెలకు సమానంగా పంచానని అన్నారు. ఆస్తిని తీసుకున్న తరువాత నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై స్థానిక పోలీసులకు, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పైగా ఫిర్యాదు చేశానని కోపంతో నా పిల్లలు దాడులకు దిగుతున్నారని వాపోయారు.

గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలని రెండేళ్ల నుంచి తిరుగుతున్నా..

● చొక్కా తీసి వృద్ధుడి నిరసన



నిరసన తెలుపుతున్న వృద్ధుడు కేశన పిచ్చయ్య

వృద్ధాప్యంలో అసరాగా నిలబడతారని ఆశతో వారసులకు ఆస్తిని అప్పజెప్పాడు.. కానీ ఆస్తి రాగానే పట్టించుకోవడం మానేశారు.. దీంతో గతంలో ఇచ్చిన ఆస్తిని తిరిగి అప్పజెప్పాలని అధికారులు చుట్టూ తిరిగాడు. కానీ అధికారులు కూడా అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. దీంతో చేసేదేమి లేక సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఎదుట నేల మీద కూర్చుని చొక్క తీసివేసి నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళ్తే తెనాలి మండలం సోమసుందరపాలేనికి చెందిన కేశన పిచ్చయ్య తన ఆస్తిని సొంత మేనకోడలుకు గిఫ్ట్ డీడీ రూపంలో అప్పజెప్పాడు. ఆస్తి రాగానే ఆయన్ను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో గతంలో ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి, ఆస్తిని తనకు అప్పజెప్పాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ కౌన్సిల్ ద్వారా ఆర్డీవోను ఆశ్రయించాడు. ఆర్డీవో సారధ్యంలో కౌన్సిల్ నడుస్తుందని కావున అప్పటి నుంచి ఆయన చుట్టూ తిరిగాడు. ఫలితం లేకపోవడంతో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వద్ద సమస్యను విన్నవించుకుని.. చొక్క విప్పి నేల మీద కూర్చోని నిరసన తెలిపాడు. దీంతో కలెక్టర్ వృద్ధుడితో మాట్లాడారు. సమస్యను వారం రోజుల్లోనే పరిష్కరించాలని ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. దీంతో వృద్ధుడు నిరసనను విరమించుకుని అక్కడి నుంచి వెనుదిరిగాడు.



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

నగరపాలక సంస్థ కమిషనర్‌కు క్షమాపణలు చెప్పాలి

● ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

గుంటూరు(తూర్పు), జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు డిప్యూటీ మేయర్ క్షమాపణలు చెప్పాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలి పారు. నిరసనల్లో బందెల రవి కుమార్, కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, అకిటి అరుణ్‌కుమార్, చనిపోతుల వెంకట్రావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ప్రస్తుత కౌన్సిల్ తీరుతో ఉద్యోగుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి భద్రత కల్పించాలని నగరపాలక సంస్థ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగ రక్షణ కల్పించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనకు జనసేన పార్టీ మద్దతు పలికింది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ అధికారులపై ప్రస్తుత ప్రజాప్రతినిధులు పరుష పదజాలంతో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కర వేదికలో కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో నగరపాలక సంస్థ ఉద్యోగులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ వ్యాఖ్యలు బాధాకరం

నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుపై కౌన్సిల్ సమావేశంలో వైసీపీకి చెందిన డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు వ్యాఖ్యలు బాధాకరమని దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. సోమవారం అరండల్‌పేటలోని అమరావతి బుక్ హౌస్‌లో దళిత, బహుజన, ప్రజాసంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ - జాషువా - పూలే- పెరియార్ లిటరేచర్ ఫౌండే షన్ అధ్యక్షుడు బి.విల్సన్, భీమ్‌సేనా సేవాదళ్ అధ్యక్షుడు నల్లపు నీలాంబరం మాట్లాడుతూ డైమండ్ బాబుని తక్షణం కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ పదవుల నుంచి తక్షణం రీకాల్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో చిన్నం డేవిడ్ విలియమ్స్, దారా అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి

గుంటూరు(తూర్పు), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీలు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నుంచి ప్రారంభమైన అంగన్‌వాడీల రిలే దీక్షలను ఆమె ప్రారంభించారు. దీక్షలకు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.దీప్తి అధ్యక్షత వహించారు. అనంతరం దయా రమాదేవి మాట్లాడుతూ జిల్లాలో వందల సంఖ్యలో వర్కర్లు, హెల్పర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని ఇంతవరకు భర్తీ చేయ లేదని ఆరోపించారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వై నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు వితంతు పెన్షన్ సహా అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దండా లక్ష్మీనారాయణ, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొనగా, దీక్షలో ఏవీఎస్ కుమారి, రాధ ప్రేమలత, పావని, పద్మావతి తదితరులు కూర్చున్నారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి : ఆలపాటి

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ శాసనమండలి ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. ఉమ్మడి కృష్ణా గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి 2025 ఫిబ్రవరి/మార్చిలో జరగబోవు ఎన్నికల్లో విద్యావంతులు, వివేకవంతులైన పట్టభద్రులు అందరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా పేరు రిజిస్టర్ చేయించుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే ఏకైక సాధనమైన ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని కోరారు. విద్యాసంస్థ కరస్పాండెంట్ పాటి బండ్ల విష్ణువర్ధన్, తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పెద కూరపాడు మాజీ ఎంపీపీ ఎన్‌వీఎస్ వరప్రసాద్, పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజు పల్లి వరప్రసాదరావు, మర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

సమాజం నుంచి కుష్ఠువ్యాధిని పారదోలుదాం

● 20 నుంచి లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు మెడికల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించి జిల్లా నుంచి కుష్ఠు వ్యాధిని పూర్తిగా పారదోలేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై నిర్వహించిన జిల్లా స్థాయి కో ఆర్డినేషన్‌కమిటీ సమావేశంలో ఆమె ప్రసంగించారు. జన వరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి రెండు వరకు జిల్లావ్యాప్తంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 79 మందికి ఉచితంగా వైద్య చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీ లక్షా న్నాయక్‌లు ప్రసంగించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌కు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రిని కలెక్టర్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ్, కమిటీ సభ్యులు జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఈవో రేణుక, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, ఎన్టీఆర్ వైద్య భరోసా జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ విజయప్రకాష్ పాల్గొన్నారు.



కారుణ్య నియామక ఉత్తర్వులు పొందిన వారితో కలెక్టర్ నాగలక్ష్మి

11 మందికి కారుణ్య నియామకాల అందజేత

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలను కలెక్టర్ నాగ లక్ష్మి అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో 11 మంది అభ్యర్థులకు నియామకపు ఉత్తర్వులను అందించారు. నిబంధనల మేరకు వారికి కేటాయించిన శాఖలలో డ్యూటీకి రిపోర్ట్ చేయాలని కలెక్టర్ సూచించారు. కారుణ్య నియామకం పొందిన అభ్యర్థులు ఉద్యోగ బాధ్యతతో పాటు కుటుంబ సభ్యుల బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేసీ భార్గవతేజ, డీఆర్వో ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

వ్యాయామశాల హాల్ లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలోని వ్యాయామ శాల హాల్ లీజుకు టెండర్ల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎస్‌డీవో నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ టెండర్లను ఈ నెల 8 నుంచి 20వ తేదీ లోపు బీఆర్ స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూ చించారు. టెండర్లను 21వ తేదీన బహిర్గతం చేస్తామని తెలిపారు. వివరాలకు 0863 2221951 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

కార్మికులకు దుప్పట్లు పంపిణీ

గుంటూరు(తూర్పు), జనవరి 6(ఆంధ్రజ్యోతి): కమ్మ జన సేవాసమితి ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమంలో భాగంగా స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో కార్మికులకు, దినసరి కూలీలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్ర మంలో సేవా సమితి ఉపాధ్యక్షుడు చుక్కపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, వడ్లమూడి నాగేంద్రం, సభ్యులు పెద్ది సాంబశివరావు, షైనేని సీతారామయ్య, కట్టా శివాజీ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న చుక్కపల్లి రమేష్ తదితరులు

ఆకట్టుకున్న నృత్యాంజలి



కూచిపూడిని ప్రదర్శిస్తున్న కళాకారులు

గుంటూరు(తూర్పు), జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటే శ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి, కథక్ కళాక్షేత్ర, కళ పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నృత్య ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమానికి కళ పత్రిక సంపాదకులు డాక్టర్ మొహమ్మద్ రఫీ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గౌరవ అతిథిగా కేసీపీ లిమిటెడ్ వైస్ చైర్మన్ డాక్టర్ వజ్జా మధుసూదనరావు హాజరయ్యారు. ఆత్మీయ అతిథులుగా రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావు, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ బాబు మిరియం, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన కథక్, ఒడిసి, కూచిపూడి, అట్టం నృత్యాలు ప్రేక్షకులు అలరించాయి.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, మాజీ మంత్రి ఆలపాటి తదితరులు

టీడీపీ లీగల్ సెల్ సభ్యత్వ నమోదు కేంద్రం ప్రారంభం

గుంటూరు లీగల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ గుంటూరు జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులకు సభ్యత్వ నమోదు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ హాజరై సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్కపల్లి రమేష్, శ్రీరాం రాజీవ్ ఆనంద్, పశ్చిమ నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కట్టా కాళిదాసు, తూర్పు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు దేవదాసు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో న్యాయవాదులు సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం ఆలపాటి రాజేంద్రప్రసాద్ పలువురు న్యాయవాదులను కలిసి కూటమి తరపున కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

నగరాభివృద్ధిపై వైసీపీ కార్పొరేటర్లు చర్చకు సిద్ధమా?

● టీడీపీ కార్పొరేటర్ల సవాల్

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర అభివృద్ధిపై వైసీపీ కార్పొరేటర్లు చర్చకు సిద్ధమా అంటూ టీడీపీ కార్పొరేటర్లు సవాలు విసిరారు. అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్‌బాబు మాట్లాడుతూ వైసీపీ కార్పొరేటర్లు 4 సంవత్సరాలుగా అధికారంలో ఉండి గుంటూరు నగరంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ 100 కోట్లతో శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు ప్రారంభించారన్నారు. నగరాభివృద్ధి మీద తమకు చిత్తశుద్ధి ఉందని చెప్పే డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు ప్రగల్భాలు మాని చర్చకు రావాలన్నారు. అధికారులను భయభ్రాంతులకు గురిచేసి, తమ అదుపులో పెట్టుకోవాలనే ఉద్దేశంతో డిప్యూటీ మేయర్ కౌన్సిల్‌లో రచ్చ చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ మాట్లాడుతూ కౌన్సిల్‌లో అధికారుల నిగ్గు తేలుస్తున్నాం.. ప్రజా సేవ కోస మే పుట్టాం, మేము లేకపోతే గుంటూరు నగరం అభివృద్ధి చెందదని వైసీపీ కార్పొరేటర్లు అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. డిప్యూటీ మేయర్ అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కమిషనర్‌ను కోరుతామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, బొడ్డుపల్లి పద్మజ, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపాలెం-ఇన్నర్ రింగ్‌రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలి

● శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు మొదలైతే పెరగనున్న ట్రాఫిక్ రద్దీ
● అందుకు అనుగుణంగా ఆయా మార్గాలను అభివృద్ధి చేసుకోవాలి
● అధికారులకు నగర కమిషనర్ ఆదేశాలు

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని రెడ్డిపాలెం-ఇన్నర్ రింగ్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధి కారులు సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుంచి రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను నగర కమిషనర్ సోమవారం పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మాస్టర్ ప్లాన్, రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ మేరకు రోడ్ విస్తరణ పనులు పక్కా ప్రణాళిక మేరకు పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నా రు. శంకర్ విలాస్ ఆర్‌వోబీ నిర్మాణ పనులు ప్రారంభమైతే నగరంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతుందని, అందుకనుగుణంగా ఆయా మార్గాలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర జరుగుతున్న పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, పనులను నాణ్యతగా చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్‌బాబు, ఎస్ఎస్ అయుబ్‌ఖాన్, ఏసీపీ ఏఈ రవికిరణ్, శాని టరీ ఇన్‌స్పెక్టర్ అంగడి రాజేష్, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.



అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

డయల్ యువర్ కమిషనర్‌కు 24 ఫిర్యాదులు

స్థానిక సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిష నర్ కార్యక్రమానికి ప్రజల నుంచి 24 ఫిర్యాదులు అందాయి. స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీఓపెన్ కాకుండా అధికారులు సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారా నికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

● ప్రజారోగ్యం కాపాడే కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు కూడా శ్రద్ధ చూపాలని, విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని కమిషనర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్రప్రదేశ్ నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజి కార్మికులకు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ కిట్లను కమిషనర్ అందజేశారు.

సంవత్సరంలో ఒక్కరోజు సెలవు తీసుకోకుండా పనిచేసిన ఉపాధ్యాయుడు

● సత్కరించిన డీఈవో సీవీ రేణుక

గుంటూరు(విద్య), జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంవత్సరం మొత్తంలో ఒక్క రోజు కూడా సెలవుపెట్టకుండా పాఠశాలలో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడిని డీఈవో సీవీ రేణుక సోమవారం సత్కరించారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్ 2024 సంవత్సరంలో ఒక్క సెలవు కూడా తీసుకోకుండా విధులు నిర్వర్తించారని డీఈవో తెలిపారు. అంతేకాకుండా 28 సంవత్సరాల సర్వీస్ మొత్తం మీద అర్ధజీతపు సెలవులు కానీ, అర్జిత సెలవు ఉపయోగించుకోలేదని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతల నుంచి నిధులు సేకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను డీఈవో కార్యాలయానికి పిలిచి సత్కరించారు.



ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను సత్కరిస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు

పంతుళ్లపాలెం

ఉపాధ్యాయ వృత్తికి అంకితం !

- నాడు వివాదాలకు పెట్టింది పేరు
- నేడు ఉద్యోగాలకు నెలవు..
- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉపాధ్యాయులున్న గ్రామంగా గుర్తింపు
- ఒకే కుటుంబంలో ఆరుగురూ టీచర్లే !
- డీఎస్సీ శిక్షణలో 50 మందికి పైగా విద్యార్థులు



ఒకప్పుడు ఘర్షణలకు మారుపేరుగా నిలిచిన ఆ పాలెం నేడు అత్యధిక ఉపాధ్యాయులు కలిగిన గ్రామంగా ఎంపికైంది. చదువుతోనే తమ తలరాతలు మారుతాయని భావించిన ఆ యువత ఉపాధ్యాయ వృత్తిని ప్రధానంగా ఎంచుకొని జీవితంలో రాణిస్తున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు గడిచిన కొంత కాలంగా ఆ గ్రామంలో 30కి మందికి పైగా ఉపాధ్యాయులుగా ఎంపికై ఆ గ్రామ ఖ్యాతిని రాష్ట్ర నలుదిశలా వ్యాప్తిచేసి ఉమ్మడి గుంటూరు జిల్లాకి ఓ ప్రత్యేకతను తీసుకొచ్చారు. ఘర్షణలను, వివాదాలను తొసిపుచ్చి, విద్యలో రాణిస్తూ, ఉద్యోగాల్లో స్థిర పడుతున్న యువత ఏనుగు పాలెంగా ఉన్న ఆ గ్రామం పేరును నేడు పంతుళ్ల పాలెంగా మార్చివేశారు.



పి. చినరామయ్య (2006 డీఎస్సీ స్టేట్ ఫస్ట్) మేడిశెట్టి ఇందిరా (2012 డీఎస్సీ జిల్లా ఫస్ట్) మేడిశెట్టి ప్రశాంత్ (2014 డీఎస్సీ జిల్లా ఫస్ట్)

వినుకొండటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాల్లోని వినుకొండ నియోజకవర్గం, వినుకొండ మండలంలోని ఏనుగుపాలెం గ్రామం అత్యధిక ఉపాధ్యాయులు కల్గిన గ్రామంగా గుర్తింపు సాధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఓ ప్రత్యేకతను చాటింది. 400 కుటుంబాలతో 1900 ఓట్లు కల్గిన గ్రామంలోని యువత ఉపాధ్యాయ ఉద్యోగాల సాధనలో ముందున్నారు. ఇప్పటికే 30కి మందికి పైగా ఉపాధ్యాయులుగానూ, ఫిజికల్ డైరెక్టర్లుగా ఉద్యోగాలు సాధించి ఏనుగుపాలెం గ్రామాన్ని పంతుళ్లపాలెంగా పిలిచేలా చేశారు.

డీఎస్సీ ఫలితాలు వచ్చాయంటే ఆ గ్రామం లోని యువత రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ర్యాంకులతో ఆ గ్రామం పేరు వినపడాల్సిందే. మొదటి తరానికి చెందిన కొణిజేటి సైదులు మాస్టారు ఆ గ్రామంలో మొట్ట మొదటి ఉపాధ్యాయుడు. ఆయనను ఆదర్శంగా తీసుకొని మేడిశెట్టి నాగేశ్వరరావు మాస్టారు రెండవ తరంలో పట్టణంలోని లయోలా పాఠశాల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గ్రామంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ యువతకు ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఏర్పడేలా చేశారు. కుటుంబంలో ఆయన సతీమణి చిన్నమ్మతోపాటు పెద్ద కుమారుడు సుబ్బారావు ఆయన సతీమణి శ్రీలక్ష్మి, రెండవ కుమారుడు ప్రశాంత్, కుమార్తె ఇందిరా (2012 డీఎస్సీ జిల్లా ఫస్ట్ ర్యాంకు) ఇలా ఒకే ఇంట్లో ఆరుగురు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. అదే గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గుడిపూడి అంజయ్య డిగ్రీ కళాశాల లెక్చరెర్‌గా స్థిరపడ్డారు. ఆ కుటుంబంలోని సోదరులైన అంకారావు, గోవిందు, వెంకటేశ్వర్లు ఆయన సతీమణి సంధ్య ఒకే కుటుంబంలో ఐదుగురు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఇలా గ్రామంలో 30 మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం గమనార్హం. మరో 40 నుండి 50 మంది విద్యార్థులు డీఎస్సీలో శిక్షణ పొందుతూ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు.



గ్రామంలోని మొట్టమొదటి ఉపాధ్యాయుడు కొణిజేటి సైదులు మాస్టారు



ఏనుగుపాలెం గ్రామంలోని ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి ఉపాధ్యాయులందరూ నాడు గ్రామంలోని సాధారణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో విద్యనభ్యసించిన అనంతరం సుమారు మూడు కిలోమీటర్ల మేరకు నడుచుకుంటూ పెదకంచర్లలోని జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి వరకు చదువుకున్న వారే. గ్రామానికి చెందిన గుడిపూడి ప్రశాంత్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులందరూ గ్రామ అభివృద్ధికోసం తమవంతు సహాయసహకారాలను అందజేస్తున్నారు. ఉద్యోగులంతా కలిసి సుమారు రూ.కోటిన్నర ఖర్చుతో రామాలయం నిర్మించారు. జనవరి 26న ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమ నిర్వహణకు సన్నహాలు చేస్తున్నారు.



ఉపాధ్యాయులైన మేడిశెట్టి నాగేశ్వరరావు మాస్టారు కుటుంబ సభ్యులు

ఆరుగురు వ్యాయామ ఉపాధ్యాయులు

గ్రామంలోని పాపసాని చిన్నరామయ్య (2006 డీఎస్సీలో స్టేట్ ఫస్ట్), గణప వీరాంజి (2012 డీఎస్సీలో జిల్లా ఫస్ట్), మేడిశెట్టి ప్రశాంత్ (2014 డీఎస్సీలో జిల్లా ఫస్ట్)లతోపాటు గుడిపూడి అంకారావు, గుంటూరు నరసరింహారావు, కాల్వ ఏసురాజులు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉన్నారు. గణప వీరాంజి సతీమణి శివరాణి, తుంగ శ్రీనివాసరావు సతీమణి పుష్పలత, గుడిపూడి వెంకటేశ్వర్లు సతీమణీ సంధ్యలు ఉపాధ్యాయులుగా ఉన్నారు.

అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం

- దివ్యాంగుల పింఛన్లపై మొదలైన విచారణ
- 702 మంది ఇళ్లవద్దకు వెళ్లనున్న వైద్య బృందాలు
- ముందు రోజే నోటీసు.. ఆ తర్వాత పరీక్షలు



పిడుగురాళ్ల మండలం గుత్తికొండలో సోమవారం పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు, కార్యదర్శులు

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):నకిలీ దివ్యాంగుల పింఛన్‌లకు చెక్ పెట్టేందుకు రంగ సిద్ధం అయ్యింది. గత ప్రభుత్వం హయాంలో గ్రామ, వార్డు సచివాలయంలో రూ. 10 వేలు మామూళ్లు చెల్లించి నకిలీ వికలాంగుల సర్టిఫికెట్ పొందిన వారికి ఇబ్బంది రానుంది. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ద్వారా రూ. 15 వేలు పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వైద్య బృందాలు వెళ్లనున్నాయి. ఈ నెల 6వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జిల్లాలోని 702 మంది ఇళ్లకు ఈ బృందాలు వెళ్లనున్నాయి. వారంలో మూడు రోజుల పాటు వైద్య బృందాలు పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా నిపుణులు అయిన వైద్యులతో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. వికలాంగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన డాక్టర్స్ కమిటీలో ఒక ఆర్థోపెడిక్, ఒక జనరల్ ఫిజీషియన్, సంబంధిత ఏరియా మెడికల్ ఆఫీసర్లు సభ్యులుగా ఉంటారు. వీరికి సహాయంగా ఒక డిజిటల్ అసిస్టెంట్ కూడా ఉంటారు. ఈ బృందం ప్రతి రోజు 25 మంది పింఛన్ దారులను వారి ఇళ్ల వద్దే పునః పరిశీలించి ధ్రువీకరిస్తారు. నిర్ణయించబడిన షెడ్యూల్ కన్నా ఒక రోజు ముందే లబ్ధిదారులకు నోటీసులు ఇస్తారు. వైద్య బృందాలను, మండల పరిషత్, మునిసిపల్ అధికారుల మధ్య సమన్వయం చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా..

జిల్లాలో రూ. 15 వేలు పొందుతున్న పింఛన్లు పొందున్న దివ్యాంగుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. చేబ్రోలు మండలంలో 34 మంది, దుగ్గిరాల మండలంలో 22 మంది, గుంటూరు టోటల్ 15, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 82 మంది, కాకుమాను మండలంలో 22, కొల్లిపొర మండలంలో 24, మంగళగిరిలో 42, మంగళగిరి మునిసిపాలిటీలో 5 మంది, మేడికొండూరు మండలంలో 30, పెదకాకాని మండలంలో 34, పెదనందిపాడు మండలంలో 40, ఫిరంగిపురం మండలం లో 59 మంది, పొన్నూరు మండలంలో 30, పొన్నూరు మునిసిపాలిటీలో 18 మంది, ప్రత్తిపాడు మండలంలో 28, తాడేపల్లి మండలంలో 15 మంది, తాడేపల్లి మునిసిపాలిటీ లో 12, తాడికొండ మండలంలో 32, తెనాలి మండలంలో 48 మంది, తెనాలి మునిసిపాలిటీలో 29 మంది, తుళ్లూరు మండలంలో 47 మంది, వట్టిచెరుకూరు మండలంలో 34 మంది చొప్పున రూ. 15 వేలు పెన్షన్ పొందుతున్నారు.

అన్నీ బాగున్నా వికలాంగులే..

తాడికొండ మండలంలో ఒక వ్యక్తి రెండు కాళ్ళు లేవని పింఛన్ పొందుతున్నాడు. కానీ అతను రెండు కాళ్ళు బాగానే ఉన్నాయి. సైకిల్ కూడా బాగానే తొక్కుతాడు. అదే మండలంలో మరొకరికి కళ్ళు బాగానే కనపడినా చూపు లేదని సర్టిఫికెట్ ఇచ్చారు. ఇలా ప్రతి చోట అనర్హులకు రూ. 15 వేలు పింఛన్ ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి నకిలీ సర్టిఫికెట్‌లు సచివాలయం ద్వారానే మంజూరు అయ్యాయి.ర`హ. 10 వేలు ఇస్తే చాలా చోట్ల సచివాలయం సిబ్బంది ఇటువంటి సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు. ప్రస్తుతం డాక్టర్ల బృందం ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పరీక్షించి నిజమైన దివ్యాంగులా? కాదా అన్న విషయాన్ని నిర్ధారిస్తున్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో

మరో 159 మంది ఎంపిక

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ పరేడ్ మైదానంలో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థుకు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో మరో 159 మంది తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. దేహదారుఢ్య పరీక్షలకు 331 మంది హాజరవగా, వారిలో 43 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 288 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 14 బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడం వల్ల తిరస్కరణకు గురయ్యారు. మిగిలిన 274 మందికి 1600 మీటర్ల పరుగు పందెం



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

నిర్వహించగా 105 మంది విఫలమవ్వగా, 169 మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారు. 169 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 21 మంది అర్హత సాధించగా 148 మంది విఫలమయ్యారు. 169 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 159 మంది అర్హత సాధించారు. 10 మంది విఫలమయ్యారు. మొత్తం 288 మంది మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 159 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. మహిళా కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా

వేడుక

- భక్తి శ్రద్ధలతో ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవం
- సమష్టి దివ్య పూజాబలిలో
- పాల్గొన్న బిషప్‌లు
- వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవ భక్తులు



పెదకూరపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిబండ్ల గ్రామంలో సోమవారం ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య ప్రధానార్చకులుగా వ్యవహరించగా ముఖ్య ప్రసంగీకులుగా శ్రీకాకుళం పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ రాయరాల విజయ కుమార్ ప్రసంగించి ముగ్గురు రాజుల దేవాలయ విశిష్టతను వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ గాలి బాలి కడప, విజయవాడ పీఠాధిపతులు డాక్టర్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, కర్నూలు పీఠాధిపతులు డాక్టర్ గోరంట్ల జ్వానేష్, వరంగల్ పీఠాధిపతులు డాక్టర్ ఉడుముల బాల, నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం, ఖమ్మం పీఠాధిపతులు డాక్టర్ ప్రకాష్ సాగిలి, నెల్లూరు పీఠాధిపతులు డాక్టర్ పిల్లి ఆంతోని దాసు, నల్గొండ పీఠాధిపతులు డాక్టర్ కే దమన కుమార్, డాక్టర్ గోవిందు జోజి, స్థానిక విచారణ గురువులు చిన్నాబత్తిని హృదయ రాజు, సహాయ గురువు నందిగామ సురేష్‌లు ప్రత్యేక ప్రసంగాలు, పూజలను నిర్వహించారు. పాటిబండ్ల గ్రామానికి చెందిన దేశ, విదేశాల్లో స్థిర పడిన వారు ఈ శత వార్షికోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన విచారణ గురువులు, మత కన్యలు, వేలాది మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



ఆలయ శతవార్షికోత్సవానికి హాజరైన పీఠాధిపతులు



ముగ్గురు రాజుల దేవాలయ శతవార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న శ్రీకాకుళం పీఠాధిపతులు డాక్టర్ రాయర్ల విజయ కుమార్

శృంగారపురం బెల్లంతో

అరిసెలు అదుర్స్ !





కళాయిలో బెల్లం ఊటను కలియబెడుతున్న రైతు

సంక్రాంతి వస్తుందంటే గుర్తుకొచ్చేరి అరిసెలు, అరిసెల తయారీకి ముఖ్యంగా కావలసింది బెల్లం. బెల్లం సరయినది అయితేనే అరిసెల పాకం బాగా వచ్చి, మంచి రుచిగా వస్తాయి. డెల్టా ప్రాంతంలో నాణ్యమైన బెల్లానికి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం శృంగారపురం కేరాఫ్ అడ్రస్‌గా పేరొందింది. ఈ ఈ ప్రాంతం వారు నగరాలకు వెళ్లినా, విదేశాలకు వెళ్ళినా సంక్రాంతి వస్తుందంటే అమ్మమ్మ, నాయనమ్మలు మనుమలు, మనుమ రాండ్లకు తినిపించే పిండివంటల కోసం బెల్లం కావాలంటే శృంగారపురం గ్రామాన్ని వెతుక్కుంటూ రావల్సిందే.

దుగ్గిరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తుందంటే గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని శృంగారపురం గ్రామంలోని బెల్లం తయారీ కేంద్రాలు కిటకిటలాడుతుంటాయి. ఇక్కడ సహజ వ్యవసాయపద్ధతుల్లో పండించిన చెరకుతో గత 70ఏళ్లుగా మూడుతరరాలు బెల్లం తయారు చేసి నాణ్యమైన బెల్లాన్ని అందింస్తున్నారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా, స్థానికంగా పండించిన నాటు చెరకుతోనే, బెల్లం తయారీ ఇక్కడ ప్రత్యేకం. ఎప్పటికప్పుడు అవసరమైన మేరకు చెరకు గడలు నరికి క్రషర్‌లో వేసి తీసిన స్వచ్ఛమైన చెరకురసంతో బెల్లం తయారు చేస్తున్నారు. అచ్చులుగా పోసి వాటిని పేర్చి ఒక్కోబాక్స్ 22కిలోలు చొప్పున, 33.6కిలోల బరువుండే బెల్లం బుట్టలలో పేర్చి క్రషర్ వద్దే విక్రయిస్తున్నారు. అరిసెలు, బూరెలు, జిలేబీ తయారీకి ప్రధానంగా వినియోగించే బెల్లం తయారీకి శృంగారపురం శాశ్వత చిరునామాగా మారింది. ఎంతో పేరొందిన, తెనాలి సత్యనారాయణ టాకీస్ రోడ్డులోనూ, వడ్లమూడి, రేవేంద్రపాడు గ్రామాల్లో దుకాణాల్లో లభించే జిలేబీ శృంగారపురం బెల్లంతోనే తయారు చేస్తారని చెప్పడం విశేషం.

కూలీల కొరతతో తగ్గిన తయారీ..

గతంలో బెల్లం తయారీ కూలీలు వందల సంఖ్యలో ఉండగా పరిసరగ్రామాల్లో ప్రస్తుతం బెల్లం వండే కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయింది. కూలీల కొరతతో శ్రీకాకుళం, గోదావరి జిల్లాల నుంచి వలస వచ్చిన కూలీలతో బెల్లం తయారీ క్రషర్‌లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారు చేసే బెల్లానికి గిరాకీ ఎక్కువగా ఉన్నప్పటికీ గిట్టుబాటు కాక పోవడంతో సంప్రదాయంగా మాత్రమే బెల్లం తయారు చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా లాభాపేక్ష లేకుండా ఆనవాయితీ పోనివ్వకుండా పెందుర్తి రవికాంత్, యలవర్తి అంకారావు తదితర కొద్ది మంది రైతులు మాత్రమే బెల్లం తయారీ క్రషర్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ విక్రయించే బెల్లం పాకం సీసాలు టీ, కాఫీల్లోనూ పంచదారకు బదులుగావినియోగించ వచ్చునని చెప్పడం విశేషం.



చెరకుతో వండి సిద్ధం చేసిన బెల్లం బుట్టలు



ధర కొంచెం ఎక్కువైనా..

గత కొద్దికాలంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇదివరలో 200 ఎకరాలకు పైగా ఉన్న చెరకు పంట విస్తీర్ణం 20ఎకరాలకు చేరుకోగా 30కిపైగా ఉన్న బెల్లం క్రషర్‌ల సంఖ్య మూడుకు చేరుకుంది. కాలక్రమంలో బెల్లం వాడకం కంటే పంచదార వాడకం పెరగడంతో బెల్లంకు డిమాండ్ తగ్గింది. గిట్టుబాటు కానప్పటికీ పెద్దల అడుగుజాడల్లో నడుస్తున్న కొద్దిమంది చెరకు రైతులు మాత్రం బెల్లం తయారీ కొనసాగిస్తూ వచ్చారు. దీపావళి నుండి సంక్రాంతి వరకూ కేవలం ఏటా రెండు నెలలపాటు మాత్రమే శృంగారపురంలో బెల్లం తయారు చేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో బెల్లం ధర కిలో రూ.80ల వరకూ ఉండగా, ఎలాంటి కెమికల్స్ కలపని ఇక్కడి బెల్లం, ధర మాత్రం రూ.110 నుంచి రూ.130లకు విక్రయిస్తున్నారు.



ఆరబెట్టిన బెల్లం అచ్చులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకాల్వకు 1516 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1516 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 148 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 200 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 100 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 50 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 975 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

611 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జనవరి 6: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 611 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,300, గరిష్ఠధర రూ.12,500, మోడల్‌ధర రూ.11,600 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,300, గరిష్ఠధర రూ.11,911 మోడల్‌ధర రూ.11,600 పలికాయి.

ట్రాఫిక్‌కు అవరోధం కలిగిస్తే చర్యలు

మంగళగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు అవరోధం కలిగిస్తే చర్యలు తప్పవని మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు. చినకాకాని ఎన్నారై జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సోమవారం సాయంత్రం ఆయన పర్యవేక్షించారు. చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయరాదని, నిర్దేశించిన స్థలంలో మార్జిన్ లోపల మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, డ్రైవింగ్ లైసెన్సు, ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని తెలియజేశారు. నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

ప్లాస్టిక్ రహిత నగరానికి సహకరించాలి

మంగళగిరి సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మంగళగిరిని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా కోరారు. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ పేపర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్ల విక్రయించడం, వినియోగించడం నిషేధించారన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా ఇప్పటికే నగరంలో సచివాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్నారని తెలిపారు. అలాగే, ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైయిన్లలో వేయకుండా పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేసి సహకరించాలని కోరారు.

తుది ఓటర్ల జాబితా ప్రచురణ

మంగళగిరి సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తుది ఫొటో ఓటర్ల జాబితా-2025ను ప్రచురించి నట్టు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎ.లక్ష్మీకుమారి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజల సందర్శనార్థం సంబంధిత బీఎల్వోలు ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారని చెప్పారు. ప్రజలు తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి డీఈవో సత్కారం



ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను సత్కరిస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంవత్సరం మొత్తంలో ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా పాఠశాలలో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడుని డీఈవో సీవీ రేణుక సోమవారం సత్కరించారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్ 2024 సంవత్సరంలో ఒక్క సెలవు కూడా తీసుకోకుండా విధులు నిర్వర్తించారని డీఈవో తెలిపారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

గుంటూరు (విద్య) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో సీవీ రేణుక సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎల్‌బీనగర్‌లో మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డీ తిరుపతిరెడ్డి పాఠాలు సక్రమంగా బోధించడం లేదని ఫిర్యాదులు రావడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పంటకాలువలకు మోక్షం

● కాలువల పూడికతీతతో పెరిగిన నీటి ఫ్లో
● ప్రత్తిపాడు ప్రాంతానికి సాగు నీటి పరుగులు



పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ ద్వారా పరుగులు పెడుతున్న నీరు

ప్రత్తిపాడు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తి నిరాదరణకు గురైన పంట కాలువలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే మోక్షం లభించింది. నాగార్జున సాగర్ కుడికాలువకు చివరన ఉన్న ప్రత్తిపాడు ప్రాంతానికి ప్రతి ఏడాది నీరు రావాలంటే యుద్ధమే చేయాల్సి వచ్చేది. కాలువలు సరిగా లేకపోవడం వల్ల పైనుంచి చివరి వరకు నీరందే పరిస్థితి ఉండేది కాదు. కానీ ప్రస్తుతం పంట కాలువల్లో నీరు పరుగులు పెడుతున్నాయి. గతంలో లేని విధంగా నాలుగు వందల క్యూసెక్కుల వరకు కాలువల్లో నీరు పరుగులు పెడుతున్నాయి. ఏ రైతు నీరు తమ పంటలకు నీరు అందలేదని దిగాలు వ్యక్తం చేసే అవకాశమే లేకుండా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇటీవల కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల డీసీ చైర్మన్లు కాలువల పూడికతీతపై దృష్టి పెట్టారు.

పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్స్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కల్లూరి కుసుమ ఆధ్వర్యంలో ఇప్పటికే మల్లాయపాలెం మేజర్‌తో పాటు కాకుమాను మేజర్ కాలువల పూడికతీత పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఒక వైపు నీరు వదులుతుండగానే మరో వైపు నుంచి కాలువలు పూడిక తీస్తూ వచ్చారు. బాగా పేరుకుపోయిన నాచు, తూటాకుతో పాటు గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు చివరి వరకు నీటిని విడుదల చేస్తున్నారు. అంతే కాకుండా కెనాల్స్ ఉన్నతాధికారులతో మాట్లాడి 250 క్యూసెక్కుల నీటిని నాలుగు వందల క్యూసెక్కులకు పెంచి రైతు కంట కన్నీరు లేకుండా చేస్తున్నారు.

వంకాయలపాటి మేజర్‌లో పూడికతీత



వంకాయలపాటి మేజర్‌లో పూడిక తీత పనులు ప్రారంభిస్తున్న డీసీ చైర్మన్ అయినంపూడి నాగేశ్వరరావు

ఇదే క్రమంలోనే వంకాయలపాటి మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ అయినంపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కాలువ పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయనప్పటికీ రైతులకు చివరి వరకు నీరు అందించాలన్న లక్ష్యంతో ముందుగా సొంత సొమ్ముతో పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రత్తిపాడు చివరి భూములకు నీరందించాలనే సంకల్పంతో ఉన్నారు. ఈ క్రమంలోనే పేరేచర్ల నుంచి కాలువ పూడిక తీత పనులు ఆరు పొక్లయినర్స్‌తో ప్రారంభించినట్లు డీసీ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ పనులు మరో నాలుగైదు రోజుల్లో పూర్తవుతాయి. దీంతో ఈ మరి కొన్ని సంవత్సరాలు ఈ ప్రాంతానికి సాగు నీటితో పాటు తాగునీటి సమస్య కూడా తీరుతుంది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, మన్నవ పూర్ణచంద్రరావు, కుర్రి సుబ్బారెడ్డి, కొర్రపాటి మధుసూదనరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉండవల్లిలో టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జొన్నా రాజేష్, గాదె వినయ్ తదితరులు

తాడేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో సంక్రాంతి పండుగ సందర్భంగా తాడేపల్లి సూపర్ లీగ్ పేరుతో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో ఉండవల్లి దేవుడిమాన్యం గ్రౌండ్‌లో ఈ నెల 7నుంచి 12 వరకు టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జనసేన, టీడీపీ నేతలు జొన్నా రాజేశ్, గాదె వినయ్ సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ టిఎస్ఎల్ (తాడేపల్లి సూపర్ లీగ్) పేరుతో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో పలు క్రీడా టోర్నమెంట్లు నిర్వహించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన నారా లోకేశ్‌ను ఆదర్శంగా తీసుకుని పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. మొదట నమోదు చేసుకున్న 30 టీంలకు మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ప్రవేశ రుసుం రూ.300లుగా నిర్ణయించామని చెప్పారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.7వేలు, టీడీపీ మండలం ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు ఆధ్వర్యంలో అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్ జొన్నా శ్రీనివాసరావు, జనసేన మండల కార్యదర్శి చాముండేశ్వరీదేవి, మాధవి, మేకా నాని, క్రికెట్ లీగ్ ఆర్గనైజర్స్ కె దినేష్ చక్రవర్తి, గాజుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ సభ్యుల ఎన్నిక



శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు

మంగళగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడిలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి దేవస్థానం ఆలయ కమిటీని సోమవారం ఎన్నుకు న్నారు. ఆలయకమిటీ చైర్మన్‌గా కుర్రా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ధర్మకర్తలుగా లింగినేని సుబ్బారావు, యేళ్ల స్పందన, నున్నం గోపాల కృష్ణ, అన్నవరపు శ్రీనివాసరావు, పదర్తి వంశీకృష్ణ ప్రభృతులను ఎన్నుకున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పూజారి దీవి విజయసారధి, అన్నె శివపార్వతి ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి జరిగిన ఈ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాదల రమేష్‌బాబు, జవ్వాది కిరణ్ చంద్, యేళ్ళ శివరామయ్య, అన్నె చంద్రశేఖర్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, గడ్డిపాటి అపర్ణ, నాగళ్ల రామకృష్ణ, మద్దుకూరి రమేష్, నడపన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

విజ్ఞాన వికాసానికి విద్య దోహదం : ఎంఈవో కెన్నడీ



పాఠశాల యాజమన్య కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో కెన్నడీ

కాకుమాను, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన వికాసానికి విద్య ఎంతో దోహదం చేస్తుందని ఎంఈవో కేఎఫ్. కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమష్టి కృషి అవసరమన్నారు. బడి బయట విద్యార్థులు పాఠశాలలో చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరికి ప్రాథమిక విద్య అందాలని దేశానికి బంగారు భవిష్యత్తు యువతేనన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల అభ్యాసన స్థాయిలను పరిశీలించి ఉపాధ్యాయులతో కలసి మన బడి విద్యావికాస మాసపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో -2 కేవీ భాస్కరరావు, స్థానిక జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సత్యం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, చైర్మను తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తామని వైసీపీ నాయకుల మోసం

గుంటూరు, జనవరి 6(ఆంధ్రప్రదేశ్): తనకు కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తన నుంచి ఏడున్నర లక్షల డబ్బులు తీసుకొని వైసీపీ నాయకులు బండి మోహనరావు, ఎస్ శివారెడ్డి మోసం చేశారని తుళ్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన బాణావతి రాజానాయక్ ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఇంటర్మీడియట్ వరకు చదివిన రాజానాయక్ వడ్డమాను గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. అయితే ఆయనకు గ్రామానికి చెందిన బండి మోహన్‌రావు, ఎస్ శివారెడ్డి అనే ఇద్దరు పరిచయమయ్యారు. తనది కడప జిల్లా అని, తనకు వైసీపీ నాయకులతో సంబంధాలు ఉన్నాయని శివారెడ్డి చెప్పాడు. కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తామని ఇందుకు ఏడున్నర లక్షలు ఖర్చవుతుందని మోహన్‌రావు, శివారెడ్డి చెప్పారన్నారు. ఈ క్రమంలో వారిద్దరి ఖాతాలకు విడతల వారీగా 2021 నుంచి 2022 వరకు 7.5 లక్షల నగదు జమ చేశాను అన్నారు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నారన్నారు ఈ క్రమంలో నెలరోజుల క్రితం తుళ్లూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పగా రాలేదన్నారు. దీనిపై తుళ్లూరు డీఎస్పీకి ఫిర్యాదు చేయగా ఆయన పిలిపిస్తే మోహనరావు మాత్రమే వచ్చారని, తనకు సంబంధం లేదని శివారెడ్డి డబ్బు తీసుకున్నాడు అని చెప్పి తప్పించుకుంటున్నాడు అన్నారు. తన నుంచి మోహనరావు, శివారెడ్డి అనే ఇద్దరు తమ ఖాతాలకు డబ్బులు జమ చేయించుకున్నారని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తన డబ్బు తనకు ఇప్పించాలని ఫిర్యాదులో వేడుకున్నాడు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని..

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని తననుంచి పెదపరిమికి చెందిన ఏ శ్రీనివాసరావు అనే వ్యక్తి 2 లక్షలు తీసుకొని మోసం చేశాడని తాడికొండకు చెందిన దామరవరపు నాగసూర్యం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తాను కాంగ్రెస్ పార్టీ తాడికొండ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నానని చెప్పి, తనకు రాజకీయంగా పలుకుబడి ఉందని, ప్రభుత్వశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తన నుంచి రెండు లక్షలు తీసుకున్నాడన్నారు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నాడని ఎస్పీ కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదులో బాధితుడు సూర్యం పేర్కొన్నారు.

ఏపీసీపీడీసీఎల్ వార్షిక ఆదాయంపై ప్రజాభిప్రాయ సేకరణ

తుళ్లూరు, జనవరి 6:(ఆంధ్రజ్యోతి) ఏపీ విద్యుత్ పంపిణీ (ఏపీసీపీడీసీఎల్) వార్షిక ఆదాయ అవసరాలపై ప్రజాభిప్రా యం సేకరిస్తున్నట్టు సీఆర్డీఏ సర్కిల్ ఎస్ఈ పట్నం సుబ్రహ్మ ణ్యం ఒక ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. ఈ నెల 7, 8, 10 తేదీల్లో రాయపూడి విద్యుత్ సౌధ భవనంలో అన్ని విద్యుత్ సర్కిల్ డివిజన్ ఆఫీసుల్లో తగిన ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే సీఆర్డీఏ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ అభిప్రాయాలను విద్యుత్ నియంత్రణ మండలి వారికి విన్నవించాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రత్యక్షంగా వచ్చి గాని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గాని కార్యక్రమంలో పాల్గొని అభిప్రాయాలు తెలపాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన వార్షిక రిటైల్ ధరల పై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ వ్యక్తిగతంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీసుకుంటామని తెలిపారు.

ఇల్లులేని పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

● అర్జీలు స్వీకరించిన సీపీఐ నేతలు

తాడేపల్లి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లులేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయిం చాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య కోరారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం తాడేపల్లి నులకపేట పంప్ హౌస్ కాలనీలో పేదల నుంచి అర్జీలు స్వీకరిం చారు. సీఎం చంద్రబాబు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో పేదల కు మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించి తామే స్వయంగా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కావున హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంచర్ల కాశయ్య, తుడిమిల్ల వెంకటయ్య, దొంతా కోటేశ్వరరావు, షేక్ బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ఫిరంగిపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల పరిధిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్ ఆవిష్కరణను సోమవారం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జే ప్రసాదరావు, హరిబాబులు, ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, చందన కుమారిలు, డాక్టర్ కరీనా బేగం, డాక్టర్ శ్వేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ ఫిరం గిపురం యూనిట్ అధ్యక్షులు కొండపల్లి సుదర్శనరాజు, పీ అన్న మేరి, కే మోహన్‌బాబు, హేమలత, సాయి పాల్గొన్నారు.



ఏపీజీఈఏ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఫిరంగిపురం మండల తహసీల్దార్ జే ప్రసాదరావు

పీహెచ్‌సీకి వైద్య పరికరాల అందజేత



పీహెచ్‌సీకి వైద్యపరికరాలు, స్టేషనరీ అందజేసిన ఎస్‌బీఐ ప్రతినిధులు

మంగళగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్‌బీఐ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఎవేర్ ఎన్జీవో సంస్థ తరపున అత్యాధునిక వైద్య పరికరాలను అందజేశారు. సుమారు 2 లక్షల రూపాయల విలువ చేసే వైద్య పరికరాలు, స్టేషనరీ వస్తువులను సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఎవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, ప్రాజెక్టు డైరెక్టర్ పీవరుణ్, ఎస్‌బీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల బాగులో యాజమాన్య కమిటీలదే బాధ్యత



విద్యార్థినికి నోట్ పుస్తకాలు, పలకలను పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు కమల మోహన్

ఫిరంగిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం మండలపరిషత్ పాఠశాలలో యాజమాన్య కమిటీ సభ్యులకు కీలకపాత్ర ఉంటుందని, వారి బాధ్యతలు కూడా ఎక్కువగా ఉంటాయని ప్రధానోపాధ్యాయుడు కమలమోహన్ అన్నారు. అంతేగాక సామాజిక తనిఖీ గురించి ఆయన వివరించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ మున్నంగి శివకు మారి మాట్లాడుతూ బడి అభివృద్ధికి తల్లి దండ్రులు కృషి చేయాలని ఆయన కోరారు. కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా సదావర్తి అన్నదాన సత్రం ఇచ్చిన నోట్ పుస్త కాలు, పలకలను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో విద్యా సెక్రటరీ వెంకటేశ్వరనాయక్, ఉపాధ్యాయులు శేషు రవికుమార్, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమాలకు కేరాఫ్ 'శ్రీదేవసేన'

మేడికొండూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్లలోని శ్రీదేవసేన రైస్ మిల్లు రేషన్ బియ్యం అక్రమాలకు కేరాఫ్ అడ్రసుగా మారిపోయింది. ఒకటే మిల్లు పలు దఫాలుగా రేషన్ పట్టుకున్నా వారిలో మార్పు రావడం లేదు. మళ్లీ మళ్లీ రేషన్ బియ్యం పట్టుబడుతున్నాయి. గతంలో పలు దఫాలు రేషన్ బియ్యంతో పట్టుబడగా నాలుగు రోజుల క్రితం ఆటో బియ్యం తరలిస్తూ మేడికొండూరు పోలీసులకు పట్టుబడ్డారు. ఇది జరిగిన కొద్ది రోజులు గడవక ముందే సోమవారం రాత్రి భారీగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. స్థానికులు సమాచారం మేరకు పౌర సరఫరా శాఖాధికారులతో పాటు స్థానిక తహసీల్దార్ తన సిబ్బందితో రైస్ మిల్లుపై దాడి చేయగా ఏపీ39యూక్యూ 3534 బొలెరో వాహనంలో నల్లబజారుకు తరలించడానికి సిద్ధంగా ఉండడంతో పాటు మిల్లు లోపల రెండు గుట్టలుగా పోసివున్న బియ్యం కనిపించాయి. వాటిని పరిశీలించగా అవి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. మొత్తం ఎన్ని క్వింటాళ్లు ఉన్నాయనేది కాటా పెడుతున్నారు. వంద క్వింటాళ్ల వరకు ఉండవచ్చునని అధికారులు అనుమానిస్తున్నారు. నిర్వహణ దారులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.

కోళ్ల ఫారంలో రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోళ్లకు మేతగా ఉపయో గిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం రెవెన్యూ సిబ్బంది స్వాధీ నం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు తెలియజేసిన వివరాల ప్రకారం గ్రామంలోని ఓ కోళ్ల ఫారంలో కోళ్లకు మేతగా రేషన్ బియ్యాన్ని ఉపయోగిస్తున్నారనే సమాచారంతో ఆర్ఐ హనుమం తరావు తనిఖీ చేయగా 3.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోకాళ్లపై నిలబడి క్లాప్ ఆటో డ్రైవర్ల నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

మంగళగిరి సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మెలో భాగంగా క్లాప్ ఆటో డ్రైవర్లు సోమవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు అందక క్లాప్ డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డ్రైవర్లకు వేతనం రూ.24,500 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించ కుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీ యూ నేతలు రాఘవులు, వీసం జవహర్‌లాల్, బి.వెంకటేశ్వర్లు, బాలాజీ, డి.శివ, ఎం రవి, ఆర్ కృష్ణ, వై శివ, పీ శ్రీనివాసరావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.


గుర్తింపుకార్డులున్న కౌలురైతులకు బ్యాంకు రుణాలు



చిలువూరులోని యూనియన్ బ్యాంకు ఎదుట నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కౌలు రైతుసంఘ నాయకులు

దుగ్గిరాల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కౌలురైతు గుర్తింపు కార్డులు కలిగిన రైతులందరికీ పంట రుణాలివ్వాలిందేనని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుసంఘ కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. చిలువూరులోని యూనియన్ బ్యాంకు ఎదుట కౌతురైతు సంఘనాయకుల ఆధ్వర్యంలో కౌలురైతులకు రుణాలపై ధర్నా, నిరసన ప్రదర్శన సోమవారం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ కౌలురైతులకు పంటరుణాలివ్వాలని, బ్యాంకర్స్ కమిటీ రాష్ట్రస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ బ్యాంకుల మేనేజర్లు మాత్రం తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని, ఆంక్షలు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. కౌలురైతు చట్టంలోనూ మార్పులు తేవాలని, భూయజమాని అనుమతితో నిమిత్తం లేకుండా పంటరుణాలివ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నవ నాగమల్లేశ్వరరావు, బైరగాని శ్రీనివాసరావు, తోకల రామారావు, నెమలికంటి దానయ్య, కోటా ప్రభాకర్, సునీత, కృష్ణారావు, పలువురు కౌలు రైతులు, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధే ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు

తాడేపల్లిగూడెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల అభివృద్ధే ధ్యేయంగా తమ బ్యాంకు ముందుకెళ్తుందని ఖాతాదారులు, శ్రేయోభిలాషులు సహకారం కూడా లభించడం సంతోషంగా ఉందని కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. బ్యాంకు ఖాతాదారుల సమావేశాన్ని సోమవారం మంగళగిరి శాఖలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికంగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. బ్యాంకు స్థాపించి 25 ఏళ్ళు పూర్తి చేసుకుని వివిధ జిల్లాల్లో ఇప్పటికి 33 శాఖలను స్థాపించి ఖాతాదారులకు సత్వర సేవలను అందిస్తూ రూ.1600 కోట్లు వ్యాపారాన్ని చేస్తున్నామన్నారు. ఖాతాదారుల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అనంతరం ఖాతాదారుల నుండి పలు సలహాలను, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో బ్యాంకు ముఖ్య నిర్వహణాధికారి కే శ్యాంకిషోర్, రీజనల్ మేనేజర్ జాస్తి మురళి, మేనేజర్ మమత తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

హోటల్ వ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు



రాధాకృష్ణమూర్తి

తెనాలి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపేటకు చెందిన హోటల్ వ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఖాజీపేటకు చెందిన తిరుమలశెట్టి రాధాకృష్ణమూర్తి ఆదివారం సాయంత్రం హోటల్‌కు అవసరమైన సరుకులు తెచ్చేందుకు కొలకలూరు వెళుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో సోమవారం రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు అర్జీలు

తెనాలి, మారీసుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి రెండు అర్జీలు, టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆక్రమణ నిర్మాణాన్ని తొలగించాలని ఒక అర్జీ వచ్చిందని తెలిపారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 4 అర్జీలు వచ్చాయి.

● తెనాలి రూరల్: రెవెన్యూ గ్రామ సభల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ చెప్పారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్, ఇతర అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

మూడు లారీలు సీజ్

కొల్లిపర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి తదితర గ్రామాల ఇసుకరీచ్‌ల్లో ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక లారీలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. లారీలను తహసీల్దార్ కార్యాలయాలనికి తరలించగా తహసీల్దార్ సిద్ధార్థ జరిమానా విధించారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి'

తెనాలి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. శివాజీ చౌక్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు వెంకటేశ్ మాట్లాడుతూ, జీవో 77 రద్దు చేయాలని, తల్లికి వందనం వెంటనే అమలు జరపాలని కోరారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల సమస్యను అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోగా తీరుస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

13న మట్టి మనిషి నాటక ప్రదర్శన

తెనాలి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మట్టి మనిషి నాటక ప్రదర్శన జరుగుతుందని సంఘ ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. చేబ్రోలుకు చెందిన రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి మట్టి మనిషి నవలను 1972లో రచించగా, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా 14 భాషల్లోకి అనువదించిందన్నారు. హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ నటీనటులు 50మందితో, దర్శకుడు బాషా దర్శకత్వంలో నాటక ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ నెల 12న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కూడా ప్రదర్శిస్తామన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, బెన్‌హర్, హృదయరాజు, కృష్ణ, రామమోహనరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంతిమ సంస్కారాలు

తెనాలి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో ఆదివారం విద్యుదాఘాతంతో గాయపడిన కోతి సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. విద్యుదాఘాతానికి గురైన కోతికి సత్వరమే వైద్యసేవలందించినా సోమవారం ఉదయం మృతిచెందింది. దీంతో గ్రామస్థులు, మహిళలు కోతికి పూజలు నిర్వహించి అంతిమ సంస్కారాలు జరిపించారు.

పూర్వ విద్యార్థినికి సత్కారం

తెనాలి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ చెన్నైలో సీటు సాధించిన విద్యార్థిని కామినేని గుణశ్రీని నెహ్రూనికేతన్ ఎండీ మురళీకాంత్ సత్కరించారు. సోమవారం పాఠశాలలో పూర్వ విద్యార్థి గుణశ్రీని, ఆమె తల్లిదండ్రులు రాజ్యలక్ష్మి, శేఖర్‌లను సన్మానించారు.

శిథిలావస్థలో కాలి నడక వంతెన

● భయాందోళనలో ప్రజలు... వాహన చోదకులు

● పట్టించుకోని అధికారులు... ప్రజాప్రతినిధులు





దావులూరు సమీపంలో శిథిలావస్థకు చేరిన కాలినడక వంతెన, బీటలువారిన వంతెన గోడ

కొల్లిపర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు సమీపంలో బూతుమిల్లి కాల్వపై ఏర్పాటుచేసిన కాలినడక వంతెన శిథిలావస్థకు చేరింది. శిథిలావస్థ చేరి ఏళ్లుగడుస్తున్నా పట్టించుకున్న నాథులే లేరు. ఈ వంతెన నిర్మాణం చేపట్టి సుమారు 77 సంవత్సరాలు పైబడింది. దీంతో ఎప్పుడు కూలిపోతుందేమోనని గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. దావులూరుకు, తూములూరు అడ్డరోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన ఈ కాలినడక వంతెన మరమ్మతులకు నోచుకోకపోవడంతో కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. కాలినడక వంతెనకు ఇరువైపులా ఏర్పాటుచేసిన గోడలు పూర్తిగా నెర్రెలు ఇచ్చి దెబ్బతిన్నాయి. శ్లాబ్‌కు ఏర్పాటుచేసిన చువ్వలు కూడా బయటపడ్డాయి. ఈ కాలినడక వంతెన శిథిలావస్థకు చేరుకుందని అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోలేదని దావులూరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తూములూరు అడ్డరోడ్డు నుంచి దావులూరు, చక్రాయపాలెం, బుర్రిపాలెం, తెనాలి వెళ్ళటానికి అతి దగ్గరగా ఉండటంతో ఈ కాలినడక వంతెన ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ వంతెనపై వెళుతుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో రోడ్డు నిర్మాణానికి, వంతెనకు కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయి. దావులూరు నుంచి కాలినడక వంతెన వరకు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సమయంలో ఎన్నికల కోడ్ రావటంతో కాలినడక వంతెన నిర్మాణ పనులు, వంతెన దగ్గర నుంచి దావులూరు అడ్డరోడ్డు వరకు రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. నడవటానికి కూడా వీలులేకుండా పోయింది. ఎన్నికల తర్వాత కూడా కాలినడక వంతెన నిర్మాణ పనులు, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలినడక వంతెనకు ఒక పక్క గోడ పూర్తిగా దెబ్బతినడంతో ఆ వంతెనపై వెళ్ళాలంటేనే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన వంతెన నిర్మాణాన్ని, మిగిలిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పూర్తిగా దెబ్బతిన్న దావులూరు వెళ్లే రోడ్డు



ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ ఏసీపీ శివన్నారాయణ

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించండి

● మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ శివన్నారాయణ

తెనాలి, మారీసుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ స్థలాలలో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ శివన్నారాయణ తెలిపారు. సోమవారం స్థానిక స్వరాజ్ టాకీస్ సెంటర్‌లో మున్సిపల్ క్లాంపెక్స్ షాపుల వద్ద ఆక్రమణలను మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ శివన్నారాయణ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం అభివృద్ధి చెందుతుందని దానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను పురపాలక సంఘం చేపట్టిందని, ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పట్టణంలో రోడ్ల విస్తరణ పనులను చేపట్టామన్నారు. పట్టణ ప్రజలు కుడా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని, కొంతమందికి నోటీసులు కూడా ఇచ్చామని వారు తొలగించుకుంటే భవనాలకు ఎటువంటి నష్టం జరగదన్నారు. గడువులోపు ఆక్రమణలు తొలగించకుంటే తమ సిబ్బంది తొలగిస్తారని, మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా మున్సిపల్ అధికారులకు సహకరించినపుడే సుందర తెనాలి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారు నిర్మాణానికి భూమిపూజ



కొబ్బరికాయకొట్టి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసమే రైతు మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేట ఎల్ఐసీ ఆఫీసు రోడ్డులో గల మున్సిపల్ ఖాళీ స్థలంలో నూతన రైతు బజారు నిర్మాణం కోసం భూమి పూజను పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ కమిషనర్ శేషన్నతో కలసి భూమి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.15 లక్షలతో రైతుబజార్‌ను నిర్మిస్తున్నామని రైతులు పండించిన నాణ్యమైన కూరగాయలను దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా వినియోదారులకు అతి తక్కువ లాభాలతో అందించేలా రైతు మార్కెట్‌లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ జి.కోటేశ్వరావు, మున్సిపల్ ఇంజనీర్ ఎ.శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15వ వార్డులో...

పట్టణంలోని 15వ వార్డులో స్పెషల్ శానిటేషన్ గ్యాంగ్ వర్క్‌ను మున్సిపల్ శానిటేషన్ అధికారులు నిర్వహించారు. సోమవారం వార్డులో జరుగుతున్న శానిటేషన్ గ్యాంగ్ వర్క్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రెయిన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో మురుగునీటి పారుదలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. భవన యజమానులు డ్రెయిన్‌లపై ఆక్రమణలు తొలగించాలని లేకుంటే సిబ్బంది తొలగిస్తారన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావు, టీపీవో సాంబశివరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఇంచార్జ్ ఏఈ కళ్యాణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాయల ఉద్యోగుల సమస్యలపై పోరాటం

పొన్నూరు టౌన్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయాల సమస్యలపై సమిష్టి పోరాటం చేస్తామని సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ అన్నారు. సోమవారం నిడుబ్రోలులో పొన్నూరు గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏర్పాటుచేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఇమామే, కార్యదర్శిగా ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాక్షుడిగా షేక్ బాబ్జి, ఎన్.శ్రీకాంత్, టి.ఆనందరావు, సంయుక్త కార్యదర్శులుగా ఈ అశోక్ కుమార్, సీహెచ్ వెంకట సుబ్బారావు, కోశాధికారిగా వి సాయిరాం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, రాష్ట్ర కార్యదర్శి మధు తదితరులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి: వ్యవసాయాధికారి మాధవి

కొల్లిపర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయం అవరణలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలను కొల్లిపర మండల మోడల్‌టీమ్ ప్రదర్శన నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలపై అవగాహన కలిగించారు. మాధవి మాట్లాడుతూ ప్రతి కుటుంబం కూడా కావలసినటువంటి ఆకుకూరలు, కూరగాయలను పేరటిలో పండించుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు నాగజ్యోతి, సుధారాణి పాల్గొన్నారు.

పింఛన్లపై విచారణ

తెనాలి, మారీసుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో అనారోగ్య సమస్యలతో పింఛన్లను పొందుతున్న వారిని మున్సిపల్ కమిషనర్ శేషన్న వైద్య సిబ్బంతో కలసి విచారణ చేశారు. సోమవారం స్థానిక ఐతానగర్‌లోని 39వ వార్డులో మంచానికి పరిమితమై హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న వైద్య సిబ్బందితో కలసి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బోగస్ పింఛన్ల ఏరివేత ప్రక్రియలో భాగంగా పురపాలక సంఘ పరిధిలో మంచానికి పరిమితమై హెల్త్ పింఛన్‌లు పొందుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో 29మంది హెల్త్ పింఛన్లు పొందుతున్నారన్నారు. వైద్య బృందం ఇంటికి వెళ్లినప్పుడు అందుబాటులో లేకపోయిన వారి పింఛన్లను హోల్డ్‌లో పెడతామన్నారు. కొంతమంది తప్పుడు సదరమ్ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నవారిని గుర్తించి వారి పింఛన్లను తొలగించడం జరుగుతుందన్నారు. అందుకు బాధ్యులైన వైద్యాధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివప్రదాదేవి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



శివప్రదాదేవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి పాములపాటి అంకినీడు ప్రసాదరావు సతీమణి పాములపాటి శివప్రదాదేవి కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పరామర్శించారు. ఇటీవల శివప్రదాదేవి మృతి చెందారు. ఈ సందర్భంగా నిడుబ్రోలులోని శివప్రదాదేవి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పూల నివాళి అర్పించారు. కార్యక్రమంలో నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ బాబు, పి.వాసు, పాములపాటి సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో జోరుగా మోటారు వైర్ల చోరీలు

పొన్నూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడిలో మోటారు వైర్ల చోరీ ముఠా రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. చింతలపూడిలో పంట పొలాల్లో రైతులు పంటల సాగుకోసం నీటిని తోడేందుకు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. పంట పొలాల్లో రాత్రివేళ వైర్ల దొంగతనం చేసే ముఠా గత 20 రోజులుగా చెలరేగిపోతోంది. మోటార్ వైరును చోరీచేసి దుకాణాల్లో తక్కువ రేటుకు విక్రయిస్తున్నట్లు సమాచారం. గత 20 రోజులుగా చింతలపూడిలో 200 మోటార్లకు సంబంధించి వైరును చోరీ చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు పంటకు నీటి తడులు అందించేందుకు ఈ చోరీలు ఆటంకంగా మారాయి. చోరీ జరిగిన వెంటనే రైతులు వైరు ఏర్పాటు చేసుకున్నా, రెండో రోజు చోరీకి గురవుతున్నాయి. దీనిపై పోలీసులు స్పందించి ఈ చోరీలను అరికట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

కొలకలూరులో పరిశుభ్రమైన నీరు అందిస్తాం: డీఎల్‌పీవో

తెనాలి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొలకలూరులో వాటర్ హెడ్ ట్యాంక్ ద్వారా పరిశుభ్రమైన తాగునీరు అందేలా చూస్తామని డీఎల్‌పీవో స్వరూపరాణి చెప్పారు. కొలకలూరు గ్రామంలో వాటర్ హెడ్ ట్యాంక్ ద్వారా సరఫరా అయ్యే మంచినీటి వాల్స్‌కి లీకులు కావడంతో మురుగునీరు చేరి కలుషితమైన నీరు సరఫరా అవుతుందని అధికారులకు గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం డీఎల్‌పీవో స్వరూపరాణి గ్రామంలో పర్యటించారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ సమీపంలో వాల్స్ భూమిలో ఉండటంతో నీరు లీకవుతూ అపరిశుభ్రవాతావరణం నెలకొని ఉండటాన్ని గుర్తించారు. వారం రోజుల్లోపు నీరు విడుదల చేసే వాల్స్‌ను ట్యాంక్ భాగానికి అమర్చి తాగునీరు పరిశుభ్రంగా అందేలా చర్యలు తీసుకోనున్నట్లు డీఎల్‌పీవో స్వరూపారాణి హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మతిన్, పంచాయతీ కార్యదర్శి పొన్నెకంటి జయ్‌దేవ్, గ్రామస్థులు ఉన్నారు.

గ్రామస్థులకు సమాచారం లేకుండా గ్రామసభ

మండలంలోని కొలకలూరులో సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఐతే గ్రామస్థులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో గ్రామస్థులు తక్కువగా పాల్గొన్నారు.

నాటక సమాజం సంక్షేమానికి వరప్రసాద్ కృషి: బుర్రా

తెనాలి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నాటక సమాజం బాగుండాలని, కళాకారుల సంక్షేమానికి జీవీఎన్ వరప్రసాద్ కృషి చేశారని సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ శ్లాఘించారు. వేద గంగోత్రి ఫౌండేషన్ నిర్వాహకులు న్యాయవాది వరప్రసాద్ సంస్మరణ సభను సోమవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళల కాణాచి, వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో ప్రదర్శించిన నాటక ప్రదర్శనలపై ఆకుల మల్లేశ్వరరావు రచించిన రంగ విపంచిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. చెరుకుమల్లి సింగారావు, గోపరాజు విజయ్, రవితేజ, తాడిబోయిన హరిప్రసాద్, వేమూరి విజయభాస్కర్, పూర్ణచంద్, రాజ్యలక్ష్మి, భవాని, వసంత యామిని, అయినాల మల్లేశ్వరరావు, సౌజన్య తదితరులు ప్రసంగించారు.

నిరుద్యోగ భృతి అందజేయాలి: ఆరేటి

పొన్నూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతిని తక్షణమే అందజేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు కోరారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏఐవైఎఫ్ నియోజకవర్గ మహాసభ జరిగింది. మహాసభలో పలువురు వక్తలు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. వలంటీర్లను కూటమి ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, సిపిఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, పురిగరాజు, గోపి, దేవరకొండ శ్రీనివాస్, చేబ్రోలు బసవ పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, జూదంపై గట్టి నిఘా ఏర్పాటు

● ఎస్ఐ కోటేశ్వరరావు





కొల్లిపర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి, జూదంపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నామని... ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఆంధ్రజ్యోతితో సోమవారం పలు అంశాలపై వెల్లడించిన వివరాలు.

ప్రశ్న: శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించటంతో, సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉంటున్నాం.

ప్రశ్న: ఇసుక మాఫియాపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ: ఇసుక మాఫియాపై గట్టి నిఘా ఏర్పాటు చేశాం. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో దాడులు నిర్వహించటంతో పాటు ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని వాటిని సీజ్ చేసి కేసునమోదు చేస్తున్నాం.

ప్రశ్న: ఇసుక మాఫియా దాడులు చేయటానికి కూడా వెనుకాడటం లేదని ఆరోపణలున్నాయి. వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జ: ఇసుక మాఫియా దాడులపై ఇప్పటికే పలు కేసులు నమోదు చేశాం. ఇసుక మాఫియాపై పోలీసులకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: గంజాయి వాసనలు ఇంకా గ్రామాల నుంచి తొలగలేదు ఈ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారా?

జ: గంజాయిపై గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఇటీవల రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం.

ప్రశ్న: లంక గ్రామాల్లో పేకాట శిబిరాలు నిర్వహణపై ఏం చేస్తున్నారు?

జ: ఇప్పటికే అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా ఉంచాం. గ్రామస్థులు వీటిని అరికట్టడానికి పోలీసులతో సహకరిస్తే జూదాన్ని పూర్తిగా అరికడతాం.

ప్రశ్న: బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవించటంపై ఏం చర్యలు చేపడుతున్నారు?

జ: బహిరంగ మద్యపానం నేరం. చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నాం.

చొక్కావిప్పి వృద్ధుడి నిరసన

గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలంటూ



చొక్కా తీసివేసి నిరసన తెలుపుతున్న వృద్ధుడు కేశన పిచ్చయ్య

గుంటూరు (తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గిఫ్టుడీడ్‌ను రద్దు చేయాలంటూ ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోకపోవటంపై వృద్ధుడు చొక్కావిప్పి నిరసన తెలిపిన సంఘటన గుంటూరులో జరిగింది. తెనాలి మండలం సోమసుందరపాలెంకు చెందిన కేశన పిచ్చయ్య తన ఆస్తిని మేనకోడలుకు గిఫ్ట్ డీడ్‌గా అప్పజెప్పాడు. ఆస్తి రాగానే ఆయన్ను పూర్తిగా నిర్లక్ష్యం చేయటంతో గతంలో ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేసి, తన ఆస్తిని తనకు అప్పజెప్పాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ కౌన్సిల్ ద్వారా ఆర్డీవోను ఆశ్రయించాడు. ఫలితం లేకపోవడంతో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వద్ద సమస్యను విన్నవించుకుని.. చొక్కావిప్పి నేల మీద కూర్చొని నిరసన తెలిపాడు. ఆరు పదుల వయస్సులో రెండేళ్ల నుంచి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. దీంతో కలెక్టర్ వృద్ధుడి సమస్యను వారం రోజుల్లోనే పరిష్కరించాలని ఆర్డీవోకు ఆదేశాలిచ్చారు. దీంతో వృద్ధుడు నిరసనను విరమించి అక్కడి నుంచి వెనుదిరిగాడు.

పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సీఐటీయూ వినతి

గుంటూరు (తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తొలగించిన చేబ్రోలు పంచాయతీ పారిశుధ్య కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం అర్జీ అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు ఏళ్ల తరబడి చేబ్రోలు గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, ఎటువంటి కారణం లేకుండా ఈ నెల 1వ తేదీ నుంచి 12మంది కార్మికుల్ని రేపటి నుంచి పనిలోకి రావద్దని అధికారులు చెప్పడం దారుణమన్నారు. ఈ అక్రమమైన చర్యను ఉపసంహరించుకొని వర్కర్లును విధుల్లో కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు ఎన్.రాఘవమ్మ, పి.సుజాత, ఆర్.సీత, కే దివ్యశ్రీ, డి.దీపిక, శారద తదితరులు ఉన్నారు.



గోదాదేవి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

భక్తి శ్రద్ధలతో గోదాదేవికి సారె సమర్పణ

పొన్నూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం గోదాదేవికి సారె సమర్పణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి రంగ నాయక సమేత గోదాదేవి ఉత్సమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్ఠించి నగరోత్సవం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి సమర్పించే సారెతో నగరోత్సవంలో పాల్గొన్నారు. పట్టణంలోని తోటమ్మ గుడి, బ్రహ్మణ బజారు మీదుగా తిరుప్పావై పఠిస్తూ మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీలకు కేటాయించిన భూములు కొని మోసపోవద్దు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ

తెనాలి రూరల్, జనవరి 06(ఆంధ్రజ్యోతి): చుండూరు మారణకాండలో మృతి చెందిన మాల, మాదిగల కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం కేటాయించిన భూములను కొని ఎవ్వరూ మోసపోవద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని హోటల్ గౌతమ్ గ్రాండ్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ చుండూరు ఘటన జరిగినప్పుడు ప్రభుత్వం బుడంపాడులో 16 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. ఆ భూమిపై అక్రమార్కుల కన్ను పడి దానిని అమ్మకాలకు ప్రయత్నిస్తున్నారు. చుండూరు మృతుల కుటుంబాలకు 50 సెంట్ల చొప్పున 32 మందికి బుడంపాడులో భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. అయితే ఆ భూమి పంటలు పండించేందుకు అనువుగా లేకపోవడంతో దానిని అమ్మి వచ్చిన సొమ్ముతో మరో ప్రాంతంలో కొనుగోలు చేసుకునేందుకు హక్కుదారులందరూ నిర్ణయం తీసుకోగా భూమిని కొనేందుకు ఎవ్వరూ ముందుకురాలేదన్నారు. ఆ సమయంలో బుడంపాడుకు చెందిన నూతలపాటి అశోక్ అమ్మకాలు చేస్తానని వారిని నమ్మబుచ్చి 2015లో దళితుల వద్దకు వచ్చాడన్నారు. అప్పటి నుంచి ఆ భూమి తనదేనంటూ అమ్ముతానని చెబుతన్నారని ఆ భూమికి నూతలపాటి అశోక్‌కు ఎటువంటి సంబంధం లేదని ధర్మారావు పేర్కొన్నారు.